నేటి కందం- నేటికి అందం

సదమల వృత్తి చరించుచు
కదమును ద్రొక్కుచును భవ్య గతిలో ధృతిలో
పది వత్సరములు ప్రజలకు
ముదము నొసంగినవి దేశమున చిరు సంస్థల్ !!

(పది సంవత్సరాల ప్రయాణంలో దేశంలోని చిన్న అంకుర సంస్థలు ఎంతో ప్రగతి సాధించి ప్రపంచంలోనే మూడవ స్థానంలో భారత దేశాన్ని నిలబెట్టడం సంతోషంగా ఉన్నదని ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ వేదికల మీద కొనియాడారు.)

-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

పరిశ్రమల ప్రైవేట్
పథకాలన్నీ సఫలం
స్వదేశీ వస్తువుల
స్వయంవృద్ధి విఫలం.
మేకిండియా టీమిండియా
మిషన్ ఏడ అమలు
ఇప్పుడేమో పొదుపంటూ
ఇంకెందుకు భ్రమలు.

చురక

-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 19-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:220 పేజీలు:6 వెల: రూ.1/-


## సమగ్ర డిజిటల్ విద్యాసంస్థగా పరిణామం చెందేలా కృషి : ప్రొ.ఘంటా చక్రపాణి



హైదరాబాద్, మే 18: సమగ్రమైన అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకుని క్రమపద్ధతిలో అమలు చేయడం ద్వారా డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమగ్ర డిజిటల్ విద్యాసంస్థగా పరిణామం చెందే దిశలో ముందడుగు వేస్తోందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో 'విద్యావారోత్సవాలు' ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. అత్యున్నత విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సాంప్రదాయ విద్యా కార్యక్రమాలతో పాటు ఉపాధి ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు.

మరింత మెరుగైన విద్యాబోధన అందించే క్రమంలో ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఐడీపీ) ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి, ఓఎస్‌డీ ప్రొ.రవీంద్రనాథ్ సోలమన్ తదితరులు పాల్గొన్నారు.

## చైనాలో భూకంపం.. రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రత నమోదు



చైనా, మే 18: చైనాలోని గ్వాంగ్జీలో భూకంపం సంభవించింది. ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలు పై 5.2 గా నమోదైంది. ఈ భూకంపం మూలంగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. లియుజౌ నగరంలో 7,000 మందికి పైగా నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భూకంప ప్రభావిత నైరుతి ప్రాంతంలో గాలింపు, సహాయక చర్యలు ముగిశాయి. భూకంపం నేపథ్యంలో రవాణాకు అంతరాయం కలుగుతోందని అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు.

అధికారులను ఉటంకిస్తూ ప్రభుత్వ మీడియా జిన్హువా తెలిపిన వివరాల ప్రకారం.. శిథిలాల కింద చిక్కుకున్న 91 ఏళ్ళ వృద్ధుడిని అధికారులు కాపాడారు. ఈ భూకంపం కారణంగా మరణించిన ఇద్దరిలో 63 ఏళ్ళ పురుషుడు, 53 ఏళ్ళ మహిళ ఉన్నారు. వీరు దంపతులని అధికారులు తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని జిన్హువా వెల్లడించింది.

భూకంపం కారణంగా సోమవారం తెల్లవారుజామున లియుజైలో పదమూడంతస్తుల భవనాలు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో పలు ప్రాంతాలకు వెళ్ళే దారులు మూసుకుపోయాయి. ఎత్తైన భవనాల నుంచి ప్రజలు భయంతో బయటకు పరుగు తీశారు. వందల ఇళ్ళు కూలిపోయాయి.

## నార్వేతో గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్..

### ఉగ్రవాదంపై పోరుకు మద్దతిచ్చినందుకు ప్రధాని కృతజ్ఞతలు..

న్యూ ఢిల్లీ, మే 18:భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.

భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు

భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

## మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### 12మంది మృతి, 25మందికి గాయాలు

న్యూ ఢిల్లీ, మే 18:మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ట్రక్ బోల్తాపడటంతో 12మంది మృతిచెందగా, మరో 25మంది తీవ్రంగా గాయపడ్డారు.

ముంబై-అహ్మదాబాద్ హైవేపై ప్రయాణిస్తున్న ట్రక్ అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తాపడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద ధాటికి వాహనం పూర్తిగా దెబ్బతింది.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఘోరం.. మద్యం సీసాతో కొట్టి స్నేహితుడి దారుణ హత్య

హైదరాబాద్, మే 18: మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. మద్యం మత్తులో తలెత్తిన చిన్నపాటి వివాదం ఒకరి ప్రాణం తీసే వరకు వెళ్లింది. తనతో పాటే కూర్చొని మద్యం సేవించిన స్నేహితుడినే ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్.టి.పి.సి (ఔఖఅ) భవనంలోని ఐదవ అంతస్తులో ఈ ఘటన చోటుచేసుకుంది. నిన్న రాత్రి నర్సింహులు అనే వ్యక్తి, అతని స్నేహితుడు కలిసి అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఒక విషయంలో తీవ్రమైన గొడవ మొదలైంది.

మద్యం మత్తులో ఉన్న స్నేహితుడు అక్కడే ఉన్న మద్యం సీసాతో నర్సింహులుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తలకు బలంగా గాయం కావడంతో నర్సింహులు ఘటనా స్థలంలోనే రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## తెలంగాణ ఈ-గవర్నెన్స్‌పై ప్రశంసలు.. ప్రజలకు సులభ సేవలపై కేంద్రం దృష్టి

హైదరాబాద్, మే 18: తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానంపై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ విషయంపై మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ వంటి కీలక శాఖల్లో ఆన్‌లైన్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు అభిప్రాయపడ్డారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేంద్ర కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్ (ఁఎ రానీఎజీనిజీబిష్ట్రజీని) ఈరోజు (సోమవారం) సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ సేవలను ప్రజలకు వేగంగా అందించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు సీఎస్ రామకృష్ణారావు వెల్లడించారు. ఈ డ్యాష్‌బోర్డుల ద్వారా పౌరసేవల్లో పారదర్శకత పెరిగిందని, ఫిర్యాదుల పరిష్కారం కూడా వేగవంతమైందని పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించడంలో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పుకొచ్చారు. ప్రజలపై అదనపు ఆర్థిక భారం లేకుండా ఈ-గవర్నెన్స్ వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేసి ప్రతి పౌరుడికి డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

డిజిటల్ సేవలను ప్రజలకు చేరువ చేసే దిశగా చర్యలు: టీవీ సోమనాథన్

ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు 'సింపుల్ ఈ-గవర్నెన్స్' విధానాన్ని బలోపేతం చేయాలని కేంద్ర కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్ ఆయా రాష్ట్రాలకు సూచించారు. డిజిటల్ సేవలను ప్రజలకు చేరువ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తమిళనాడు అమలు చేస్తున్న 'బతిఎజూశ్రీవణనీల' మోడల్‌ను అధ్యయనం చేసి, ఆయా రాష్ట్రాల్లో అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

## రోడ్డెక్కిన రైతులు.. ఐకేపీ వడ్లు కొనుగోలు చేయాలని రాస్తారోకో



మెదక్, మే 18:: రాష్ట్రవ్యాప్తంగా చాలా రోజులుగా పలు జిల్లాల్లో చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల్లో కొనే దిక్కు లేక రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని తెలిసిందే. వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతన్నలు రోడ్డెక్కారు.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో రైతులు ఐకేపీ ద్వారా వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చెట్టును రోడ్డుకు అడ్డంగా వేసి సోమవారం గజ్వేల్-రామాయంపేట ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతన్నలు రోడ్డుపై బైఠాయించి సుమారు రెండు గంటల పాటు ధర్నా చేపట్టడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

సమాచారం అందుకున్న రాయపోల్ ఎస్ఐ మానస, ఐకేపీ ఏపీఎం యాదగిరి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. వడ్ల తరలింపునకు అవసరమైన లారీలను వెంటనే ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు ధర్నాను విరమించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# ప్రేగు వాపు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉందాం !

## (19 మే "ప్రపంచ ప్రేగు వాపు (తాపజనక) వ్యాధుల దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా "ప్రేగు వాపు సంబంధ (తాపజనక) వ్యాధులు" లేదా "ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజెస్" క్రమంగా పెరగడం ఒక ప్రజారోగ్య హెచ్చరికగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యమైన ప్రేగు వాపు వ్యాధుల్లో "అల్సరేటివ్ కోలిటిస్", "క్రోన్స్ వ్యాధి" వస్తాయి. ఈ ప్రేగు సంబంధ వ్యాధుల బారిన పడడంతో కుటుంబాలు ఆర్థిక పతనం కావడమే కాకుండా దీర్ఘకాలిక చికిత్సల అవసరం అవుతాయి. పాశ్చాత్య దేశాల్లో ఆహారపు అలవాట్ల కారణంగా అధికంగా నమోదు అవుతున్న ప్రేగు వాపు వ్యాధులు నేడు ఆసియా దేశాలకు కూడా క్రమంగా విస్తరించడం గమనిస్తున్నాం. వయో పరిమితులు లేని ఈ వ్యాధులను నిర్లక్ష్యం చేసినా, రోగ నిర్ధారణ ఆలస్యం అయినా ప్రమాదకరంగా మారుతుంది.

### ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం-2026 ఇతివృత్తం:

ప్రేగు వాపు సంబంధ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 19 మే రోజున "ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం" లేదా "వరల్డ్ ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం ఇతివృత్తంగా "సరిహద్దులు లేని ప్రేగు వాపు వ్యాధులు : అందరికీ ఆరోగ్య సురక్ష" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రారంభంలోన రోగ నిర్ధారణ చేసుకోవడం ఒక ఉత్తమమైన మార్గంగా నిలుస్తుంది. అన్ని అపోహలను అధిగమించి పది మందిలో ప్రేగు వాపు వ్యాధుల పట్ల చర్చించుకోవడం వల్ల అవగాహన పెరుగుతుంది.

### ప్రేగు వాపు వ్యాధులకు కారణాలు, రోగ లక్షణాలు, నివారణ మార్గాలు:

సాధారణంగా మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి కారణంగా నిలుస్తుంది. కొవ్వులు, చక్కెరలు, రిఫైన్డ్ పిండి పదార్థాలు, తీపి శీతలపానీయాలు, జంతు సంబంధ ఆహారాలు, ఆల్కహాల్ సేవనం, నిల్వ ఉంచడానికి లేదా రంగులు రావడానికి ఆహార పదార్థాల్లో కలిపే రసాయాలు అతిగా వాడడం, అధిక కారం ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ప్రేగు వాపు వ్యాధులు పెరుగుతాయి. తాజా పండ్లు, మొలకలు, కూరగాయలు, పీచు పదార్థాలు, అధికంగా నీరు తాగడం, కలిగిన ఆహార పదార్థాలు ఆరోగ్య ప్రదాయినిలుగా నిలుస్తాయి. ప్రేగు వాపు వ్యాధుల లక్షణాల్లో ప్రేగుల్లో అల్సర్లు లేదా పుండ్లు ఏర్పడడం, మలంలో రక్తం పడడం, బరువు తగ్గడం, కడుపు నొప్పి, దీర్ఘకాలం పాటు విరోచనాలు కావడం, అలసట, ప్రేగు గోడల కణజాలం వాపు కనిపించడంతో లాంటివి కనిపిస్తాయి.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. మన జీవనశైలి మన రోగ నిరోధకతను ప్రభావితం చేస్తుంది. రోగ చికిత్స కన్న రోగ నివారణే మిన్న అనే నినాదం మన నిత్య మంత్రం కావాలి. ప్రేగు పడవాపు వ్యాధుల కట్టడికి ఆహార నియమాలను పాటిస్తూ, దురలవాట్లకు దూరంగా ఉంటూ సుఖ జీవనయానం చేయాలి. ఆరోగ్యకర పౌర సమాజ స్థాపనకు మన వంతు బాధ్యతలను నిర్వహించాలి.



-మధుపాళీ
9949700037

# ఎంపిక చేసిన స్వీడన్ వ్యాపార దిగ్గజాలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ భేటీ

న్యూఢిల్లీ, మే 18:స్వీడన్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఎంపిక చేసిన స్వీడన్ సీఈఓలతో 2026 మే17న సమావేశమయ్యారు. స్వీడన్ యువరాణి విక్టోరియా, స్వీడన్ ప్రధానమంత్రి శ్రీ ఉల్ఫ్ క్రిస్టెర్సన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భారత్, స్వీడన్ దేశాలు ప్రజాస్వామ్యం, పారదర్శకత, ఆవిష్కరణలు, సుస్థిరత వంటి ఉమ్మడి విలువల ద్వారా అనుసంధానమయ్యాయని, ఇవి ఉన్నత లక్ష్యాలను కలిగి భవిష్యత్ ఆధారిత ఆర్థిక భాగస్వామ్యానికి బలమైన పునాదిని అందిస్తాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నేడు భారత్, స్వీడన్ భాగస్వామ్యం కేవలం ఒక ఆర్థిక సంబంధం మాత్రమే కాదని, అది ఆలోచనలు, సాంకేతికత, ఆవిష్కరణలు, సహ సృష్టి ల భాగస్వామ్యమని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. భారతదేశ వృద్ధికి స్వీడిష్ కంపెనీలు సుదీర్ఘకాలంగా అందిస్తున్న సహకారాన్ని ఆయన స్వాగతించారు. పరిశోధన, ఆవిష్కరణలు, ఇంధన మార్పు, తయారీ ఉత్పాదక రంగాలలో మరింత లోతైన సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సంస్కరణలు, బలమైన దేశీయ డిమాండ్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తయారీ రంగ విస్తరణ, తదుపరి తరం మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా భారతదేశంలో వేగంగా జరుగుతున్న ఆర్థిక మార్పును ప్రధాన మంత్రి ప్రముఖంగా వివరించారు. మేక్ ఇన్ ఇండియా, జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, జాతీయ క్రిటికల్ మినరల్ మిషన్ వంటి కార్యక్రమాల కింద భారతదేశంలో తమ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాల్సిందిగా ఆయన స్వీడిష్ కంపెనీలను ఆహ్వానించారు. స్వచ్ఛ ఇంధనం, రక్షణ రంగం, సెమీకండక్టర్లు, అధునాతన తయారీ ఉత్పాదక రంగాలలో విస్తరిస్తున్న అవకాశాలను ఉపయోగించుకోవాలని కూడా ఆయన కోరారు.

సుస్థిర సరఫరా వ్యవస్థలు, హరిత మార్పు, సుస్థిర రవాణా, జీవ శాస్త్రాలు, డిజిటల్ సాంకేతికతలలో సహకారాన్ని బలోపేతం చేయడంపై కూడా ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. 21వ శతాబ్దపు సవాళ్లకు ఉమ్మడిగా పరిష్కారాలను కనుగొనడం కోసం ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధిలో స్వీడన్‌కు ఉన్న బలాన్ని, భారతదేశ విస్తృతి, ప్రతిభ, వృద్ధి వేగంతో అనుసంధానించడం చాలా ముఖ్యమని ప్రధానమంత్రి శ్రీ మోదీ స్పష్టం చేశారు.

# రవీంద్రనాథ్ ఠాగూర్ ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక బహుమతులను ఇచ్చిపుచ్చుకున్న భారత్, స్వీడన్ ప్రధానులు

న్యూఢిల్లీ, మే 18:నోబెల్ బహుమతి గ్రహీత, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ వారసత్వాన్ని స్మరించుకుంటూ స్వీడన్ ప్రధానమంత్రి శ్రీ ఉల్ఫ్ క్రిస్టెర్సన్, భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రత్యేక స్మారక బహుమతులను ఇచ్చిపుచ్చుకున్నారు.

స్వీడన్ ప్రధాని క్రిస్టెర్సన్ అందించిన బహుమతిలో ఒక పెట్టె ఉంది. అందులో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ స్వహస్తాలతో రాసిన రెండు నీతివాక్యాల (ఎపిగ్రామ్స్) ప్రతిరూపాలు, వాటి గురించిన చిన్న వివరణాత్మక పాఠ్యం, 1921లో ఉప్సలా విశ్వవిద్యాలయ సందర్శన సందర్భంగా గురుదేవ్ ఠాగూర్ దిగిన ఒక ఛాయాచిత్రం ఉన్నాయి. ఇటీవల స్వీడిష్ నేషనల్ ఆర్కైవ్స్‌లో కనుగొన్న ఈ అసలు ప్రతులను, 1921, 1926లలో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ స్వీడన్ పర్యటించిన సమయంలో స్వయంగా రాశారు.

ప్రధానమంత్రి శ్రీ మోదీ స్వీడన్ ప్రధానికి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల సంకలనాన్ని, శాంతినికేతన్ నుంచి ప్రత్యేకంగా హస్తకళతో తయారుచేసిన ఒక బ్యాగ్ ను బహుమతిగా ఇచ్చారు. స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించి వారిని బలోపేతం చేయడం కోసం గురుదేవ్ ఎంపిక చేసిన నమూనాలతో ఈ బ్యాగ్ ను రూపొందించారు. కళ అనేది కేవలం ప్రదర్శనశాలలకే పరిమితం కాకూడదని, రోజువారీ వస్తువులకు జీవం పోస్తూ, మేధోపరమైన ఆలోచనలకు, నిత్య జీవిత వినియోగానికి మధ్య వారధిగా నిలవాలనే ఠాగూర్ తత్వాన్ని ఈ బ్యాగ్ ప్రతిబింబిస్తుంది.

1913లో నోబెల్ బహుమతిని అందుకోవడానికి గురుదేవ్ ఠాగూర్ స్వీడన్ వెళ్ళలేకపోయినప్పటికీ, 1921లో ఆయన స్వీడన్‌ను సందర్శించినప్పుడు ఐదవ రాజు గుస్తావ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ బహుమతులు భారత్, స్వీడన్ దేశాల మధ్య ఉన్న ఉమ్మడి సాంస్కృతిక, మేధోపరమైన వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయ వారసత్వానికి నివాళి అర్పిస్తాయి. ఈ బహుమతుల మార్పిడి, 1926లో గురుదేవ్ స్వీడన్‌లో చేసిన చారిత్రక పర్యటన శతాబ్ది ఉత్సవాల సందర్భంతో కలసి రావడం విశేషం.

# ఘనంగా నవభారత శిల్పి డాక్టర్ కేఎల్ రావు వర్ధంతి

## -మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ, మే 18: మహానేతల జయంతులు కేవలం ఒక క్యాలెండర్ తేదీలు కావు.. అవి ఈ దేశ చరిత్రను, ఆ నేతల త్యాగాలను స్మరించుకునే పవిత్ర సందర్భాలు అని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. నవభారత నిర్మాణ శిల్పి, కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ ఇంజనీరింగ్ దిగ్గజం డాక్టర్ కనూరి లక్ష్మణరావు (కె.ఎల్. రావు) వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో విజయవాడలో ఘనంగా జరిగాయి. సోమవారం విజయవాడలోని పాత బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల జలవనరుల అభివృద్ధికి కేఎల్ రావు చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా మల్లాది విష్ణు కొనియాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేఎల్ రావు కేవలం ఒక ఇంజనీర్ మాత్రమే కాదు, కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన అపర భగీరథుడని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాతి కట్టడమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన చూపిన సాంకేతిక నైపుణ్యం అద్వితీయమన్నారు. తెలుగు రాష్ట్రాలను అన్నపూర్ణగా మార్చడంలో ఆయన పాత్రను విస్మరించలేమని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా భాక్రా నంగల్, హీరాకుడ్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల రూపకల్పన వెనుక కేఎల్ రావు మేధస్సు దాగి ఉందన్నారు.

ముగ్గురు ప్రధాన మంత్రుల హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేసినారూపాయి అవినీతి లేని నిష్కళంక చరిత్ర ఆయనదని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. నాడు ప్రకాశం బ్యారేజీ ప్రమాదంలో పడినప్పుడు స్వయంగా రంగంలోకి దిగి రాత్రి పగలు శ్రమించి కాపాడిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తన సంపాదనను సైతం ప్రజాసేవకే అంకితం చేసిన ఇలాంటి మహనీయుడి ఆశయాలతో వైఎస్సార్సీపీ ముందుకు సాగుతోందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గళమెత్తిన ఎన్ఎంయూఏ!

**-ఈ నెల 20, 21 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా "డిమాండ్స్ డే" నిరసనలు**
**-భోజన విరామ సమయాల్లో గేట్ మీటింగ్స్ నిర్వహణ**
**-ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం**
**-పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి**



విజయవాడ, మే 18: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20, 21 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా "డిమాండ్స్ డే" కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు వెల్లడించారు. భోజన విరామ సమయాల్లో గేట్ మీటింగ్స్ నిర్వహిస్తూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సోమవారం నగరంలోని ఓల్డ్ బస్టాండ్ ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఏవీ శ్రీనివాసరాజు, విజయవాడ జోనల్ అధ్యక్షుడు ఏవీ రామారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణా రావు, గవర్నర్‌పేట ? 2 డిపో అధ్యక్షుడు ఎన్.చంద్ర మోహన్, గవర్నర్‌పేట-1 అధ్యక్షుడు మురళి మాట్లాడారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఉద్యోగుల న్యాయమైన హక్కులు, సంక్షేమం, సంస్థ పరిరక్షణ కోసం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే విద్యుత్ బస్సులను పూర్తిగా ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "స్త్రీ శక్తి" పథకంలో అమలవుతున్న "జీరో టికెట్" విధానం కారణంగా కండక్టర్లపై అధిక పనిభారం పడుతోందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సులు కొనుగోలు చేసి, అన్ని కేటగిరీలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

రిటైర్ అయిన, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన సెటిల్మెంట్స్ ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత ఆర్టీసీ మెడికల్ ఫెసిలిటీస్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ పరిరక్షణతో పాటు కార్మికుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ "డిమాండ్స్ డే" కార్యక్రమాలను కార్మికులందరూ విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# స్వీడన్ అత్యున్నత పురస్కారం - రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్ ను అందుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, మే 18:స్వీడన్ లో18వ శతాబ్దంలో ఏర్పాటైన దేశ అత్యంత పురాతన, విశిష్ట పురస్కారాలలో ఒకటైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్' ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అందుకున్నారు. గాథెన్‌బర్గ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, స్వీడన్ యువరాణి క్రౌన్ ప్రిన్సెస్ విక్టోరియా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

అసాధారణ ప్రజా సేవకు, స్వీడన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో అందించిన విశేష కృషికి గుర్తింపుగా విదేశీ ప్రభుత్వ అధినేతలకు స్వీడన్ ఈ అత్యున్నత పురస్కారాన్ని అందిస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ మోదీ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని అందించినందుకు యువరాణి క్రౌన్ ప్రిన్సెస్ విక్టోరియాకు, స్వీడన్ ప్రజలకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారాన్ని 140 కోట్ల భారతీయ ప్రజలకు, భారత్, స్వీడన్ దేశాల మధ్య ఉన్న చిరకాల స్నేహానికి అంకితం చేస్తున్నట్టు తెలిపారు. రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ పురస్కారాన్ని అందుకోవడం భారత్, స్వీడన్ దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధాలకు, సాంస్కృతిక సంబంధాలకు దక్కిన గౌరవమని, ఇరు దేశాల ప్రజలను ఏకం చేసే ఆప్యాయత, అనురాగాలకు లభించిన గుర్తింపు అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న తొలి ఆసియా దేశాధినేత భారత ప్రధానమంత్రి శ్రీ మోదీ కావడం విశేషం.

ఈ పురస్కార ప్రదానం భారత్-స్వీడన్ దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి, ప్రపంచ శాంతి, శ్రేయస్సుకు దోహదపడటానికి ఇరు దేశాల మధ్య ఉన్న ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది.

# నెదర్లాండ్స్ ప్రధానమంత్రి గౌరవనీయ రోబ్ ఎటెన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధికారిక చర్చలు

న్యూ ఢిల్లీ, మే 18:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు 'ద హేగ్'లో డచ్ ప్రధాన మంత్రి అధికారిక నివాసం (కాట్స్ హూయిస్)లో నెదర్లాండ్స్ ప్రధానమంత్రి గౌరవనీయ రోబ్ ఎటెన్ తో అధికారిక చర్చల్లో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో భారత్-నెదర్లాండ్స్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై వారిద్దరూ విస్తృతంగా చర్చించారు. రెండు దేశాల మధ్య ఉమ్మడి విలువలు, విశ్వాసంతోపాటు సమన్వయం, సహకారం ఇనుమడించడాన్ని ప్రతిబింబిస్తూ, ఈ స్నేహబంధాన్ని "వ్యూహాత్మక భాగస్వామ్యం" స్థాయికి విస్తరించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. వాణిజ్యం-పెట్టుబడులు, రక్షణ-భద్రత, అత్యాధునిక-కీలక సాంకేతికతలు, సముద్ర రంగం, పునరుత్పాదక ఇంధనం, విద్యా రంగాల్లో సహకార విస్తృతి దిశగా వ్యూహాత్మక భాగస్వామ్యంపై భవిష్యత్ ప్రణాళిక ఆమోదానికి నిశ్చయించారు. ఉభయ పక్షాల మధ్య వ్యాపారం, పెట్టుబడులు, సాంకేతికత-ఆవిష్కరణల భాగస్వామ్య విస్తరణ సహా భారత వృద్ధి ప్రస్థానం డచ్ కంపెనీలకు ఆశావహ వ్యాపార అవకాశాలను కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

నిరంతర ఉన్నత స్థాయి సమావేశాల ద్వారా ద్వైపాక్షిక సహకారం ముందంజపై సంతృప్తి వెలిబుచ్చారు. జలవనరులు, వ్యవసాయం, ఆరోగ్యం (డబ్ల్యూ ఏహెచ్) రంగాల్లో సహకారం ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ- భారీ నీటి ప్రాజెక్టులపై పరస్పర తోడ్పాటు ద్వారా జల వనరుల విషయంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై అంగీకారానికి వచ్చారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పరిశోధన, డిజిటల్ ఆరోగ్యం, వ్యవసా యం-ఆహార భద్రత సహా కీలక రంగాల్లో సహకార విస్తృతిని ఇద్దరు ప్రధానమంత్రులూ ప్రశంసించారు.రెండు దేశాల మధ్య వాణిజ్య-పెట్టుబడి సంబంధాల విస్తరణకు వారు తమ చర్చల్లో ప్రాధాన్యమిచ్చారు.

భారత్-ఐరోపా సమాఖ్య వాణిజ్య ఒప్పందం పరిణామాత్మక సామర్థ్యాన్ని గుర్తిస్తూ- దీనికి త్వరలో సమగ్ర ముగింపునిచ్చి, అమలుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కీలక ఖనిజ రంగంలో భారత్- నెదర్లాండ్స్ సహకారం పటిష్ఠ సరఫరా వ్యవస్థకు తోడ్పడు తుందని వారు పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సెమీకం డక్టర్లు సహా ఆధునిక సాంకేతిక తల పరంగా మరింత సహకారం అవశ్యమని నాయకులిద్దరూ స్పష్టం చేశారు. రెండు దేశాల యువతరంతో హ్యాకథాన్ వంటి కార్యక్రమాల నిర్వహణను నాయకులిద్దరూ ప్రశంసించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సహకార బలోపేతంపై నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ- సుస్థిర భవిష్యత్తుకు భరోసాగా గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, గ్రీన్ షిప్పింగ్, సముద్ర రంగ సదుపాయాలలో సహకారం ప్రాధన్యాన్ని వారు స్పష్టం చేశారు. ఉన్నత విద్యలో గతిశీల భాగస్వామ్యాన్ని, సహకారాన్ని బలోపేతం చేయడం కోసం అమలు చేస్తున్న కొత్త కార్యక్రమాలకు ప్రధాన మంత్రులు మద్దతు పలికారు. ఈ మేరకు నలంద-గ్రోనింగన్ విశ్వ విద్యాలయాల మధ్య ఒప్పందాన్ని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు

.రెండు దేశాల మధ్యగల బలమైన సాంస్కృతిక సంబంధాలను ఉటంకిస్తూ- 11వ శతాబ్దపు చోళుల శాసనాలు భారత్‌కు తిరిగి చేరడంలో డచ్ ప్రభుత్వ సహకారానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. దీనికి సంబంధించి లైడెన్ విశ్వవిద్యాలయ గ్రంథాలయం, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రక కళాఖండాలపై అవగాహన పెంపొందించడంలో ఈ సహకారం తోడ్పడుతుంది.

# ఆఫ్స్లుయిట్‌డైక్ డ్యామ్‌ను సందర్శించిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, మే 18:నెదర్లాండ్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నీటి నిర్వహణ కట్టడమైన 'అఫ్స్లుయిట్‌డైక్' ఆనకట్టను నెదర్లాండ్స్ ప్రధానమంత్రి రాబ్ జెట్టన్‌తో కలిసి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సందర్శించారు.

వినూత్న నీటి నిర్వహణ పరిష్కారాలు, వాతావరణ దృఢత్వం, సుస్థిర మౌలిక సదుపాయాల పట్ల ఇరు దేశాలకు ఉన్న ఉమ్మడి నిబద్ధతను ఈ సందర్శన స్పష్టం చేసింది. ఉత్తర సముద్రం నుంచి నెదర్లాండ్స్‌లోని అత్యధిక భాగాన్ని రక్షించడంతో పాటు మంచినీటి నిల్వకు వీలు కల్పిస్తూ వరద నియంత్రణ, భూమి పునరుద్ధరణ రంగాల్లో ఈ 32 కిలో మీటర్ల పొడవైన 'అఫ్స్లుయిట్ డైక్' ఆనకట్ట, కాజ్‌వే ప్రపంచవ్యాప్తంగా ఒక అత్యుత్తమ ప్రమాణంగా పేరుగాంచాయి.

'అఫ్స్లుయిట్‌డైక్' కట్టడానికి, గుజరాత్ రాష్ట్రంలో భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే 'కల్పసర్ ప్రాజెక్ట్'కు మధ్య ఉన్న సరిపోలికలను ఈ సందర్శన చర్చలోకి తెచ్చింది. ఖంబట్ జల సంధి మీదుగా ఒక భారీ మంచినీటి జలాశయాన్ని నిర్మించడంతో పాటు అలల ద్వారా విద్యుత్ ఉత్పత్తి, సాగునీరు - రవాణా మౌలిక సదుపాయాలను అనుసంధానించాలన్న ముఖ్య లక్ష్యంతో కల్పసర్ ప్రాజెక్ట్ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్పసర్ ప్రాజెక్ట్‌పై సాంకేతిక సహకారం కోసం భారతదేశ జలశక్తి మంత్రిత్వ శాఖ, నెదర్లాండ్స్ మౌలిక సదుపాయాలు - నీటి నిర్వహణ మంత్రిత్వ శాఖల మధ్య 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'పై సంతకాలు జరగడాన్ని ఇరు పక్షాలు స్వాగతించాయి.

# బెంగళూరు-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, మే 18:బెంగళూరు - ముంబయి మధ్య ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా ప్రారంభించారు. ఇది కర్ణాటక, మహారాష్ట్రల మధ్య రైలు అనుసంధానాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక ముందడుగు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దక్షిణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాల డిమాండ్లు ఇప్పుడు నెరవేరుతున్నాయని శ్రీ వైష్ణవ్ తెలిపారు. బెంగళూరు- ముంబయిల మధ్య వందే భారత్ స్లీపర్ సేవలూ త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఆయన ప్రకటించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ... ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా పెరిగిన రైల్వే నిధులతో కర్ణాటక వ్యాప్తంగా ప్రాజెక్టుల అమలు వేగవంతమైందని శ్రీ వైష్ణవ్ పేర్కొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.2,160 కోట్ల వ్యయంతో 61 స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తుండగా... వాటిలో 9 ఇప్పటికే పూర్తయ్యాయి. బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌ను రూ.485 కోట్లతో, యశ్వంత్‌పూర్ స్టేషన్‌ను రూ.367 కోట్లతో మరింతగా అభివృద్ధి చేస్తున్నారు.

2014 నుంచి కర్ణాటకలో సుమారు 1,750 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు నిర్మించారు. హాసన్-మంగళూరు సెక్షన్ పరిధిలో సంక్లిష్టమైన విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పరీక్ష దశలో ఉన్నాయి.

బెంగళూరు సబర్బన్ రైల్వే ప్రాజెక్ట్ గురించి శ్రీ వైష్ణవ్ మాట్లాడుతూ... నాలుగు కారిడార్లలోనూ పనులు పురోగతిలో ఉన్నాయని తెలి పారు. బైయప్పనహళ్లి-చిక్కబనవర, హీలాలిగే-రాజనుకుంటె కారిడార్ల కోసం భూసేకరణ పూర్తయిందనీ, ప్రస్తుతం స్టేషన్ పనులూ జరుగుతున్నాయని తెలిపారు. కేఎస్ఆర్ బెంగళూరు- దేవనహళ్లి అలైన్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేలు సంయుక్తంగా ఆమోదం తెలిపాయనీ, జియోటెక్నికల్ సర్వే పూర్తయిందని తెలిపారు. కెంగేరి-వైట్‌ఫీల్డ్ అలైన్‌మెంట్‌కు ఇటీవలే ఆమోదం లభించిందనీ, త్వరలోనే సర్వే పనులూ ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విమానాశ్రయం, ఎలక్ట్రానిక్ సిటీ, మారతహళ్లి, హెబ్బాల్ వంటి కీలక కేంద్రాలను ఈ సబర్బన్ రైలు నెట్‌వర్క్ అనుసంధానిస్తుందని ఆయన అన్నారు.

కర్ణాటక నుంచి 12 వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని కేంద్ర రైల్వే మంత్రి తెలిపారు. బెంగళూరు-మంగళూరు మార్గంలోనూ పరీక్షలు జరుగుతున్నాయనీ, త్వరలోనే మడ్గావ్ వరకు తీరప్రాంత కనెక్టివిటీని విస్తరించనున్నట్లు శ్రీ అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

బెంగళూరును హైదరాబాద్, చెన్నైలతో కలిపే బుల్లెట్ రైలు కారిడార్లకూ ఆమోదం లభించిందని శ్రీ వైష్ణవ్ ప్రధానంగా ప్రస్తావించారు. ముంబయి, బెంగళూరు, ఇతర ప్రధాన నగరాలను అనుసంధానించేలా దీర్ఘకాలిక దృష్టితో ఈ వ్యవస్థను 7,000 కిలోమీటర్ల వరకు విస్తరించే అవకాశం ఉందనీ ఆయన పేర్కొన్నారు.

16553/54 నంబరు గల ఈ ఎస్ఎమ్‌వీటీ బెంగళూరు- లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న మాట్లాడుతూ... ఈ బెంగళూరు-ముంబయి కొత్త రైలును మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలు అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటైన బెంగళూరులోని ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. కర్ణాటక అభివృద్ధికి ఇది మరింత ఊతమిస్తుందని శ్రీ సోమన్న పేర్కొన్నారు.

కర్ణాటక నుంచి ప్రస్తుతం 14 జిల్లాలను కలుపుతూ 12 వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని శ్రీ సోమన్న తెలిపారు. తానిసంద్రలో రూ.270 కోట్ల వ్యయంతో వందే భారత్ స్లీపర్ నిర్వహణ డిపోను, బెంగళూరులోని ఎస్ఎమ్‌వీటీలో రూ.52.73 కోట్ల వ్యయంతో చెయిర్ కార్ నిర్వహణ కేంద్రాన్నీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సామర్థ్యాన్ని పెంపొందించేందుకు బైయప్పనహళ్లి-హోసూర్ (రూ. 1,116 కోట్లు), బెట్టహళ్లసూరు-రాజనుకుంటె (రూ. 248 కోట్లు) మార్గాల్లో డబ్లింగ్ పనులు... బెంగళూరు పరిసర ప్రాంతాల్లో క్వాడ్రుప్లింగ్ పనులు (రూ. 1,347 కోట్లు) చేపడుతున్నట్లు శ్రీ సోమన్న వివరించారు.

యశ్వంత్‌పూర్, కేఎస్ఆర్ బెంగళూరు, లొట్టెగొల్లహళ్లి, బైయప్పనహళ్లి, పెనుకొండ, మైసూరు, జోలార్‌పేట వంటి కీలక విభాగాల్లో మొత్తం రూ. 6,396 కోట్ల వ్యయంతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ పనులు జరుగుతున్నాయని శ్రీ సోమన్న తెలియజేశారు. మొత్తం వృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తూ... కర్ణాటకకు రికార్డు స్థాయిలో రూ. 7748 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయింపు లభించిందని ఆయన పేర్కొన్నారు. 2014 నుంచి, సుమారు 3,840 కిలోమీటర్ల రైల్వే లైన్లు అభివృద్ధి చేయగా... 3,742 కిలోమీటర్ల మార్గంలో విద్యుదీకరణ పూర్తయిందని తెలిపారు. రాష్ట్రం 100 శాతం విద్యుదీకరణకు చేరువలో ఉందనీ ఆయన పేర్కొన్నారు. 2014కు ముందు సుమారు 150 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు/రైల్వే అన్‌లయబుల్ వంతెనలు ఉండగా... ఇప్పుడు వాటి సంఖ్య 707కు పెరిగిందన్నారు. రాబోయే సంవత్సర కాలంలో మరో 146 పూర్తి కానుండగా, రానున్న మూడు సంవత్సరాల్లో అన్ని లెవెల్ క్రాసింగ్‌లను తొలగించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు శ్రీ సోమన్న తెలిపారు.

బెంగళూరు సెంట్రల్ పార్లమెంటు సభ్యులు శ్రీ పి. సి. మోహన్, రాజ్యసభ సభ్యులు శ్రీ లెహర్ సింగ్ సిరోయా, బెంగళూరు సౌత్ పార్లమెంటు సభ్యులు శ్రీ తేజస్వి సూర్య కూడా వీడియో అనుసంధానం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు సీనియర్ రైల్వే అధికారులూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు కీలకం : బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మే 18:ప్రజల ఆరోగ్యపరిరక్షణలో ఆశా వర్కర్లు కీలకమైన పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారిలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని ఆశావర్కర్లు, వారి ప్రతినిధులు లక్ష్మారెడ్డిని సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. విధులు నిర్వహించే సందర్భంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వారు ఎమ్మెల్యేకు వివరించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశా వర్కర్లు ప్రజలకు దగ్గరగా ఉంటూ వారికి మెరుగైన వైద్యసేవలు అందించడం అభినందనీయమని, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, పరిష్కరింపజేసేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆశావర్కర్ల ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

## -ట్రాక్టర్ కు తాడు కట్టి లాగుతూ వైసీపీ
## -నాయకులు వినూత్న నిరసన
## -ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నుండి ర్యాలీ

అమరావతి, మే 18:పెంచిన పెట్రోల్, డీజల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఉరవకొండ పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం



స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నుండి టవర్ క్లాక్, తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ట్రాక్టర్ కు తాడు కట్టి లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ పెట్రో ధరలు రాష్ట్రంలోనే అత్యధికం. చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో పెట్రోల్, డీజల్ ధరలు మండుతున్నారు. రాష్ట్రంపై పెట్రోల్ భారం రూ.3,391 కోట్లు రూపాయలన్నారు.

చంద్రబాబు ప్రభుత్వం మరో బాదుడే బాదుడు మొదలు పెట్టింది. సూపర్‌సిక్స్ తరహాలో మరో మోసంతో వచ్చి దగా చేస్తున్నదని ఆయన విమర్శించారు. అధికారంలోకి వస్తే పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, మ్యానిపెస్టోలో పెట్టి, అన్నింటిలాగే ఆ విషయాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఒకవైపు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు లేవు. గత మా ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని పథకాలు రద్దు చేయడ మే కాకుండా, ఇప్పుడు ఈ తరహా పెట్రోల్ బాదుడే బాదుడుతో వాహనదారులతో పాటు, ప్రజల నడ్డి పిరుస్తోంది తాజా పెంపుతో రాష్ట్రంలో లీటరు పెట్రోల్ రూ.113.62, లీటర్ డీజిల్ రూ.101.24కు చేరుకుందన్నారు. రాష్ట్రంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ఎక్కువగా ఉండటం తో, దేశం మొత్తం మీదఇక్కడే పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు.

పెరిగిన ధరల వల్ల పెట్రోల్‌పై రోజూ రూ.3.29 కోట్లు, డీజిల్‌పై రూ.6 కోట్లు అధిక భారం రాష్ట్రంలో వాహనదారులపై పడుతుంది. రాష్ట్రం వేసే పన్నే అందుకు కారణం అని, టీడీపీ అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్‌పై వేసిన పన్నును తగ్గిస్తామని, దానివల్ల రాష్ట్రంలో అన్ని ధరలు తగ్గుతాయి అని ఎన్నికల ముందు చంద్రబాబు, నారా లోకేష్ ఊదరగొట్టారు. రాష్ట్రంలో అత్యధికంగా లీటర్ పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్‌తో పాటు రూ.4 ఇంకా మరో ఒక్క రూపాయి రోడ్ డెవలప్‌మెంట్ సెస్‌గా వసూలు చేస్తున్నారు. అధికారం లోకి రాగానే, అవన్నీ తగ్గిస్తామని నాడు హామీ ఇచ్చిన చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్, ఇప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడడం లేదన్నారు.

చంద్రబాబుకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, ఇతర బాదుడు తగ్గించి, ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ భోగన్న గౌడ్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈడిగ ప్రసాద్, మాజీ ఎంపీపీ ఎర్రిస్వామి, బసవరాజు, ఆసిఫ్, మూలగిరి పల్లి ఓవన్న, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, సర్మస్, ఎర్రిస్వామి రెడ్డి, అశోక్ కుమార్, సిద్ధప్ప, గోవిందు, శ్రీరాములు, నాగరాజు, భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు కీర్తి రెడ్డి పరామర్శ



అమరావతి, మే 18:మండలంలోని కాల్వపల్లి కి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు బిస్కుల రవి, అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సోమవారం వారి కుటుంబాన్నిబీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడు నూతల నిషిధ రెడ్డిలు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మండలంలోని గాంధీనగర్ కి చెందిన బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకుడు రత్న రమేష్, తల్లి రత్న సమ్మమ్మ, అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ పంచిక మహేష్ యాదవ్ ,మండల ప్రధాన కార్యదర్శి రావుల రాకేష్ , మండల ఉపాధ్యక్షులు నల్ల శ్రీనివాస్ రెడ్డి, చింతల రాజేందర్, సంఘ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# కేజీ మల్లేల సహకార సంఘం అధ్యక్షులుగా కంటే చెన్నారావు



అమరావతి, మే 18: కేజీ మల్లేల సహకార సంఘం అధ్యక్షులుగా కంటే చెన్నారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏడాది క్రితం సహకార సంఘాల అధ్యక్షుల పదవీ కాలం ముగిసి పోవడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమి ంచిం ది. కొందరు అధ్యక్షులు కోర్టుకు వెళ్ళగా, తిరిగి పాత అధ్యక్షులకే అవకాశం కల్పించిం ది. కేజీ మల్లేల సహకార సంఘం అధ్యక్షులు కాటే జమలారావు అడసర్లపాడు గ్రామ పంచాయితీ సర్పంచిగా విజయం సాధించట ంతో అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో సీనియర్ డైరెక్టర్ అయిన కంటే చెన్నారావుకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు.

సోమవారం బాధ్యతలు చేపట్టిన చెన్నారావు కు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కంటే వెంకటేశ్వరరావు, జోనల్ కమిటీ అధ్యక్షులు దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, చెరుకు అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ పుచ్చకాయల శంకరరెడ్డి, నల్లమోతు ప్రసాద్, పోటు ప్రసాద్, సర్పంచ్ కాటే జమలారావు, దొడ్డా శోభనాచలం నాయకులు గాదె శ్రీనివాసరావు, మారోజు సురేష్, వల్లభనేని సత్యనారాయణ, మందపాటి శేఖరరెడ్డి, మాజీ టెలికం జిల్లా డైరెక్టర్ మిరియాల ప్రసాద్, కంటే అప్పారావు, కంటే నాగేశ్వరరావు, డీలర్ వెంకటే శ్వరరావు, వల్లభనేని సత్యనారా యణ, కంటే పెద్దన్న, కొనకాల లక్ష్మీనారాయణ, తాత కృష్ణయ్య, పెద్దగౌడ్ అప్పారావు, మామిడి శ్రీనివాసరావు, రాజబోయిన నరసింహారావు తోపాటు పలువు రు బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పోలీసుల అప్రమత్తతతో భారీ ఫేక్ కరెన్సీ మోసం భగ్నం..

## -ఐదుగురు నిందితుల అరెస్ట్
## -రూ.50 లక్షల టాయ్ కరెన్సీ స్వాధీనం

అమరావతి, మే 18: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పోలీసులు సులభంగా డబ్బు సంపాదించాలని ఆశించిన మోసగాళ్ల ముఠా గుట్టును రట్టు చేశారు. పోలీస్ అధికారుల వేషధారణలో అమాయక ప్రజలను మోసం చేసేందుకు కుట్ర పన్నిన ఐదుగురు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో టాయ్ కరెన్సీ, పోలీస్ వేషధారణ సామగ్రి, కౌంటింగ్ మెషీన్, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. హిందూపురం టౌన్ సీఐ రాజ్ గోపాల్ నాయుడు, టౌన్ సీఐ కరీం, హిందూపురం రూరల్ సీఐ జనార్ధన్, అప్గ్రేడ్ సీఐ ఆంజనేయులు మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితులు "ఒక లక్ష అసలు నోట్లు ఇస్తే రూ.10 లక్షల ఫేక్ కరెన్సీ ఇస్తాం" అంటూ అమాయకులను వలలో వేసుకునేవారు.

భారీ మొత్తంలో డబ్బు వస్తుందనే ఆశ చూపించి, చివరికి టాయ్ కరెన్సీని అసలు నోట్లుగా నమ్మించి మోసం చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా కొందరు నిందితులు పోలీస్ అధికారుల వేషధారణలో ప్రత్యక్షమై బాధితులను భయపెట్టే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా కదలికలపై సమాచారం అందుకున్న హిందూపురం పోలీసులు అప్రమత్తమై, లేపాక్షి మండలం కొండూరు క్రాస్ వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

అరెస్ట్ అయిన నిందితులు కే. వెంకటేష్ (34) చిలమత్తూరు, జి. చంద్రమోహన్ (26) అనంతపురం, నాగరాజు (60) బాగేపల్లి, కర్ణాటక, కే. బాలాజీ (33) సత్యసాయి నగర్, చిలమత్తూరు, పి. ఉపేంద్ర (23) లాలేపల్లి గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.50 లక్షల ముఖ విలువ గల రూ.500 టాయ్ కరెన్సీ నోట్లు, ఒక లాఠీ, రెండు ఖాకీ ప్యాంట్లు, ఒక ఖాకీ టోపీ, హ్యాండ్ కఫ్, డబ్బులు లెక్కించే కౌంటింగ్ మెషీన్‌తో పాటు AP05-EA-4898 నంబర్ గల మహేంద్ర స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ అభినందించారు. ప్రజలు ఇలాంటి సులభ ధనార్జన ఆశలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# 'యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ'ని (ఈఆర్‌టీ) ఉద్దేశించి మాట్లాడిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 18:గోథెన్‌బర్గ్‌లో 2026 మే 17న నిర్వహించిన 'యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ' (ఈఆర్‌టీ) సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడారు. వోల్వో గ్రూప్ నిర్వహించిన ఈ ఉన్నత స్థాయి చర్చా కార్యక్రమంలో స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్సన్, ఐరోపా కమిషన్ అధ్యక్షులు శ్రీమతి ఉర్సులా వాన్ డెర్ లేయన్, ఐరోపాకు చెందిన సీనియర్ పారిశ్రామిక ప్రముఖులు, ప్రముఖ యూరోపియన్-భారతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కీలక ఉపన్యాసం ఇచ్చిన ప్రధానమంత్రి మోదీ.. భారత్, ఐరోపా మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సంబంధాలను ప్రముఖంగా ప్రస్తావించారు. రోజురోజుకూ మరింత క్లిష్టంగా, అనిశ్చితంగా మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో పరస్పరం నమ్మకమైన భాగస్వామ్యాల ప్రాముఖ్యతను ఆయన ప్రధానంగా చెప్పారు.

చారిత్రాత్మకమైన 'భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' చర్చలు విజయవంతంగా ముగియడం సహా భారత్-ఐరోపా సమాఖ్య (ఈయూ) సంబంధాల్లో పెరుగుతున్న వేగాన్ని ప్రధానమంత్రి మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ఒక పరివర్తనాత్మక ఆర్థిక భాగస్వామ్యంగా అభివర్ణించారు. ఇది వాణిజ్యం, సాంకేతికత, తయారీ, సేవా రంగాలు, దృఢమైన సరఫరా వ్యవస్థలో సరికొత్త అవకాశాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు. వీటితో పాటు 'భారత్- మధ్య ప్రాచ్యం- ఐరోపా ఎకనామిక్ కారిడార్' (ఐఎంఈసీ) వంటి అనుసంధాన ప్రాజెక్టులు భారత్-ఐరోపా వ్యాపార భాగస్వామ్యానికి సరికొత్త విలువను చేకూరుస్తాయని ఆయన పేర్కొన్నారు.


నేటి ప్రపంచంలో పెట్టుబడులు, ఆవిష్కరణలు, తయారీ రంగాలకు భారతదేశం అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో ఒకటిగా నిలుస్తోందని ప్రధానమంత్రి చెప్పారు. వేగంగా కొనసాగుతున్న భారత ఆర్థిక వృద్ధి, నవతరం ఆర్థిక సంస్కరణలు, పాలనలో 'సులభతర వ్యాపార నిర్వహణ'పై ప్రత్యేక దృష్టి, విస్తరిస్తున్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), శక్తిమంతమైన తయారీ వ్యవస్థ, వేగంగా రూపాంతరం చెందుతున్న మౌలిక సదుపాయాల రంగాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిం చారు. 'భారత్ కోసం డిజైన్, భారత్‌లో తయారీ, భారత్ నుంచి ఎగుమతి' అనే దేశ దార్శనికతను ఆయన పునరుద్ఘాటించారు. అలాగే భారత్‌ను ఒక నమ్మకమైన, సురక్షితమైన ఆర్థిక భాగస్వామిగా భావించి దేశంలో తమ భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిందిగా ఐరోపా కంపెనీలను ఆహ్వానించారు.

దృఢత్వంతో కూడిన వైవిధ్య భరితమైన సరఫరా వ్యవస్థలను తయారు చేసేందుకు భారత్, ఐరోపా కలిసి పనిచేయాలని ప్రధానమంత్రి మోదీ ప్రముఖంగా చెప్పారు. రవాణా, లాజిస్టిక్స్, పునరుత్పాదక ఇంధనం, హరిత హైడ్రోజన్, అణుశక్తి రంగాలలో భారీ పెట్టుబడులతో సహా భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మౌలిక సదుపాయాలు, ఇంధన పరివర్తనను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. టెలికాం - డిజిటల్ మౌలిక సదుపాయాలు.. ఏఐ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, డీప్ టెక్ తయారీ.. హరిత పరివర్తన- స్వచ్ఛమైన ఇంధనం, మౌలిక సదుపా యాలు, చలనశీలత - పట్టణ పరివర్తన, ఆరోగ్య సంరక్షణ - లైఫ్ సైన్సెస్ వంటి రంగాలలో భారత్‌తో భాగస్వామ్యం వహించాలని ఆయన ఐరోపా పారిశ్రామిక ప్రముఖులను ఆహ్వానించారు.

భారత్, ఐరోపా మధ్య ప్రతిభావంతుల రాకపోకలు, విద్య- నైపుణ్య భాగస్వామ్యాలకు ఉన్న ప్రాముఖ్యతను కూడా ప్రధానమంత్రి మోదీ ప్రధానంగా చెప్పారు. భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్‌లోని యువ, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తే ప్రధాన బలమని ఆయన అన్నారు. ప్రజల మధ్య సంబంధాలను, ఆవిష్కరణల భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయవలసిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు.

ప్రతి సంవత్సరం 'భారత్-ఐరోపా సీఈఓల రౌండ్-టేబుల్' సమావేశాన్ని నిర్వహించాలని, ఈఆర్‌టీలో ఒక ప్రత్యేక 'ఇండియా డెస్క్'ను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి సూచించారు. భారత్-ఐరోపా ఆర్థిక, పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేసే విషయంలో అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ చర్చా కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికను అందించింది. సుస్థిర వృద్ధి, సాంకేతిక సహకారం, దృఢత్వంతో కూడిన ప్రపంచ భాగస్వామ్యాల పట్ల భారత్-ఐరోపాలకు ఉన్న ఉమ్మడి నిబద్ధతను ఇది పునరుద్ఘాటించింది.

# పచ్చల సోమేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకరం



నల్గొండ, మే 18: నల్లగొండలోని పానగల్‌లో గల అతి ప్రాచీనమైన శ్రీ పచ్చల సోమేశ్వరాలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపర్‌వైజర్ బి.సుమతి హాజరై ప్రత్యేక పూజలు చేసి ప్రమాణ స్వీకరం చేయించారు. చైర్మన్‌గా గజ్జి సురేశ్‌యాదవ్, ధర్మకర్తలుగా జంపాల శంకర్, కొండ అంజయ్య, కోదల వెంకన్న, ఈసం సక్కుబాయి, దేవాయల ప్రధాన అర్చకులు నవీన శర్మ చేశారు. అనంతరం నూతన కమిటీకి మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, 1వ డివిజన్ కార్పోరేటర్ అలకుంట్ల నాగరాజు (చిట్టి) హాజరై ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# వియత్నాం, దక్షిణ కొరియాకు రక్షణ మంత్రి అధికారిక పర్యటన

న్యూఢిల్లీ, మే 18:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 2026 మే 18, 19 తేదీల్లో వియత్నాంలోనూ, 2026 మే 19 నుంచి 21 వరకు రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోనూ పర్యటిస్తారు. ఈ పర్యటనకు బయలుదేరే ముందు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన పోస్టులో ఈ రెండు దేశాల్లోనూ చేపట్టే పర్యటన ద్వైపాక్షిక సంబంధాల పరిధిని మరింత విస్తరిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వ్యూహాత్మక సైనిక సహకారాన్నీ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యాలనూ బలోపేతం చేసుకోవడం, నౌకా వాణిజ్య సహకారాన్ని ప్రోత్సహించడం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతినీ, స్థిరత్వాన్నీ పెంపొందిచడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

వియత్నాంలో రక్షణ మంత్రి పర్యటన రెండు దేశాల మధ్య ఏర్పడిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి పదేళ్లు పూర్తయిన సందర్భాన్ని సూచిస్తుంది. ఈ భాగస్వామ్యాన్ని 2026 మే 5 నుంచి 7 వరకు భారత్‌లో వియత్నాం అధ్యక్షుడు పర్యటించిన సందర్భంలో విస్తరించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మెరుగుపరిచారు. ఈ పర్యటనలో భాగంగా వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్‌తో శ్రీ రాజనాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు చేపడతారు.

2022 జూన్ 8 నుంచి 10 వరకు రక్షణ మంత్రి వియత్నాంలో పర్యటించిన సమయంలో 2030 నాటికి భారత్-వియత్నాం రక్షణ భాగస్వామ్య సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. ద్వైపాక్షిక రక్షణ సహకారానికి నిర్దిష్టమైన మార్గాన్ని ఈ దార్శనిక పత్రం అందిస్తుంది. ఈ ప్రాంతంలో శాంతి, సంక్షేమం విషయంలో రెండు దేశాలకు ఉమ్మడి ఆసక్తి ఉంది.

వియత్నాంలో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పర్యటించే సమయంలోనే.. 2026 మే 19న ఆ దేశ మాజీ అధ్యక్షుడు హో చి మిన్ 136వ జయంతిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హో చి మిన్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి రక్షణ మంత్రి నివాళి అర్పిస్తారు.

దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఆ దేశ రక్షణ మంత్రి ఆన్ గ్యూ-బెక్‌తో శ్రీ రాజనాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని మంత్రులు సమీక్షిస్తారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు కొత్త కార్యక్రమాలను అన్వేషిస్తారు. ఉమ్మడి ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై తమ ఆలోచనలను పంచుకుంటారు.

రక్షణ కొనుగోళ్ల కార్యక్రమ నిర్వహణ సంస్థ (డీఏపీఏ) మంత్రి లీ యాంగ్ చియోల్‌తో కూడా సమావేశమవుతారు. ఇండియా-కొరియా బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు.

కొరియా యుద్ధ సమయంలో భారత్ అందించిన తోడ్పాటు చరిత్రలోని గొప్ప అధ్యాయాల్లో ఒకటి. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వం పట్ల భారత్‌కున్న అంచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శనం. యుద్ధంలో గాయపడినవారికి చికిత్సను అందించాలని నిర్ణయించి సైన్యానికి చెందిన 60 పారాచ్యూట్ ఫీల్డ్ అంబులెన్స్ విభాగాన్ని భారత్ మోహరించింది. ఈ యూనిట్ మూడేళ్లకు పైగా అనేక మంది పౌరులకు సేవలందించింది. రెండు లక్షల కంటే ఎక్కువ మంది రోగులకు చికిత్సను అందించింది. సుమారు 2,500 శస్త్రచికిత్సలను నిర్వహించింది. భారత్ అందించిన మరో సహకారం.. తటస్థ దేశాల పునరావాస కమిషన్‌కు అధ్యక్షత వహించడం. ఐక్యరాజ్యసమితిలో భారత్ చేసిన ఈ ప్రతిపాదన మెజారిటీతో ఆమోదం పొందింది. దీని ప్రకారం 5,230 మంది సైనికులతో కూడిన భారత్ కస్టోడియన్ దళం.. యుద్ధానంతర దశలో దాదాపు 2,000 మంది ఖైదీలను శాంతియుతంగా వారి స్వదేశాలకు పంపించింది.

అమర వీరుల గౌరవార్థం.. 2026 మే 21న దేశభక్తులు, మాజీ సైనికుల వ్యవహారాల మంత్రి క్వన్ ఓ-యూల్‌తో కలసి భారత యుద్ధ వీరుల స్మారక చిహ్నాన్ని ప్రారంభిస్తారు.

భారత దేశం అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్ విధానం' , రిపబ్లిక్ ఆఫ్ కొరియా అనుసరిస్తున్న 'ఇండో-పసిఫిక్ వ్యూహం' మధ్య ఉన్న సహజమైన సంబంధం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి విలువలు.. రెండు దేశాల మధ్య సంబంధాల్లో నూతన అధ్యాయానికి నాంది పలికాయి.

# ఆశ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : పి.రామకృష్ణ

హైదరాబాద్, మే 18:ఆశ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పరిగిలోని ఎమ్మెల్యే రాం మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ముందు ఆశ వర్కర్లు ధర్నా చేపట్టి కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రతినెల ఒకటవ తేదీన పారితోషికాలు చెల్లించాలని, రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలుగా పేదలకు ఆరోగ్య సేవలందజేస్తున్నారని, ఆశ వర్కర్లకు వేతనాలు పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్ వెంటనే హామీని నెరవేర్చాలన్నారు. రూ.50లక్షలు బీమా సదుపాయం, రూ.50వేలు మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన పారితోషికాలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆశ వర్కర్లకు డబ్బులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మంగమ్మ, నాయకురాళ్లు స్వరూప, సుజాత, యాదమ్మ, రమాదేవి, పద్మమ్మ, మొగులమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# స్వీడన్ ప్రధానమంత్రితో ద్వైపాక్షిక చర్చలు చేపట్టిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 18:స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో ఆ దేశ ప్రధాన మంత్రి శ్రీ ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో స్వీడన్ యువరాణి విక్టోరియా కూడా పాల్గొన్నారు. స్వీడన్ రాజు కార్ల్ చీఎవ గుస్టాఫ్, రాణి సిల్వియాల తరఫున ఆమె ప్రధానమంత్రి మోదీకి ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజు కార్ల్ చీఎవ గుస్టాఫ్ 80వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి మోదీ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.

ఇరు దేశాల నాయకులు భారత్-స్వీడన్ సంబంధాల్లోని అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించారు. వాణిజ్యం - పెట్టుబడులు, ఆవిష్కరణలు, హరిత పరివర్తన, కొత్త సాంకేతికతలు, రక్షణ - భద్రత, డిజిటలైజేషన్, ఎంఎస్ఎమ్ఈలు, అంతరిక్షం, పరిశోధన, విద్య, సంస్కృతి, ప్రజా సంబంధాల మార్పిడి వంటి వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అయినట్లు వారు పేర్కొన్నారు. ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలపై ఆధారపడి ఆవిష్కరణలు, సుస్థిరత, పరిశోధన - అభివృద్ధి అనుసంధానాల ఆధారంగా ముందుకు సాగుతున్న ఈ సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు. విస్తరిస్తున్న ఈ భాగస్వామ్యానికి దిశానిర్దేశం చేయడానికి క్రమం తప్పకుండా ఉన్నత స్థాయి రాజకీయ సంప్రదింపులు, సంస్థాగత సంభాషణలను కొనసాగించడమే కీలకమని వారు ప్రధానంగా చెప్పారు.

భారత్-స్వీడన్ సంబంధాలను 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచేందుకు ఇరు దేశాల నాయకులు అంగీకరించారు. స్థిరత్వం- భద్రత కోసం వ్యూహాత్మక చర్చలు.. నవతరం ఆర్థిక భాగస్వామ్యం.. కొత్త సాంకేతికతలు- నమ్మకమైన అనుసంధానం.. 'కలిసి రేపటిని తయారు చేయటం- ప్రజలు, గ్రహం, ఆరోగ్యం, దృఢత్వం' అనే నాలుగు ప్రధాన అంశాల ఆధారంగా ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ముందుకు సాగుతుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి ఇరు దేశాల నాయకులు 'భారత్-స్వీడన్ ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక 2026-2030'ను ఆమోదించారు. ఇది రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, భద్రత, పర్యావరణం, ప్రజా సంబంధాల రంగాలలో పరస్పర సహకారానికి ఒక సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తుంది.

ఇటీవల కుదిరిన 'భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' ఆర్థిక, వాణిజ్య సంబంధాలలో ఒక కొత్త అధ్యాయాన్ని తెరిచిందని ఇరు దేశాల నాయకులు ప్రధానంగా చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక అనుసంధానాలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా ఈ ఒప్పందాన్ని వీలైనంత త్వరగా అమలు చేసేందుకు తమ ప్రయత్నాలను కొనసాగించాలని వారు అంగీకరించారు.

ఆవిష్కరణలు, స్వచ్ఛ సాంకేతికతలు, అధునాతన తయారీ, సుస్థిర చలనశీలత, డిజిటల్ పరివర్తన వంటి వ్యూహాత్మక రంగాలలో భారత్‌తో స్వీడన్ కొనసాగిస్తున్న నిరంతర భాగస్వామ్యాన్ని ప్రధానమంత్రి మోదీ అభినందించారు. డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధ రంగాల్లో భారత్ సాధిస్తున్న అద్భుతమైన పురోగతిని స్వీడన్ ప్రధానమంత్రి క్రిస్టెర్సన్ ప్రశంసించారు. స్వీడన్ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణల వ్యవస్థకు అక్కడ నివసిస్తున్న భారతీయ సమాజం అందిస్తున్న సానుకూల సహకారాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత వృద్ధి పథంలో స్వీడన్ కంపెనీలు మరింత విస్తృతంగా భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి మోదీ ఈ సందర్భంగా ఆహ్వానించారు.

ఇరు దేశాల నాయకులు పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర బహుపాక్షిక సంస్థల సంస్కరణల అత్యవసర అవసరాన్ని వారు ప్రముఖంగా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌కు స్వీడన్ అందిస్తోన్న బలమైన మద్దతుకు ప్రధానమంత్రి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, స్థిరత్వం, దృఢమైన సరఫరా గొలుసులు, సుస్థిర ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడంలో తమకున్న నిబద్ధతను ఇరు దేశాల నాయకులు మరోసారి పునరుద్ఘాటించారు.

# విద్యార్థులు విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు

మెదక్, మే 18: జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఎస్ఐహెచ్ఎంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.




ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితోపాటు నిథమ్ విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించడంతోపాటు, పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్'పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునః ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.

**స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి..**

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఎస్ఐహెచ్ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన ఈ యుగంలో, ప్రైవేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను అందుకోవడానికి పర్యాటక, ఆతిథ్య (హాస్పిటాలిటీ) రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, మాజీమంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్లు, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి




మహబూబ్‌నగర్, మే 18:ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారంలోకి రాకముందు ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అమలు చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే అక్రమ అరెస్టులు పాల్పడుతున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ఆరోపించారు. ఎమ్మెల్యే లేకపోవడంతో ఆఫీసు కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు సంవత్సరాలు కావస్తున్న ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదని మండిపడ్డారు. ప్రతి నెల రావాల్సిన పారితోషకాలు రెండు మూడు నెలలైనా రావటం లేదన్నారు.

ప్రతి నెల 5వ తేదీ లోపు పారితోషకాలు అకౌంట్లో వేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మూడు నుంచి నాలుగు నెలలు అవుతున్న పారితోషకాలు పెండింగ్లో ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిల రాముయ్య , ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, కృష్ణవేణి, సువర్ణ, కార్యకర్తలు చంద్రకళ, శిరీష, వరలక్ష్మి, విజయనీల అమీనా, లక్ష్మీ, భాగ్యమ్మ, వెంకటమ్మ, మంజుల, గౌరమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

# 'నల్లగొండ కార్పొరేషన్‌లో సంపూర్ణ అక్షరాస్యతకు ప్రత్యేక చర్యలు'

## -మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్గొండ, మే 18: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఉల్లాస్''' కార్యక్రమం ద్వారా పట్టణ ప్రాంతాల్లో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ ఓబిలకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలు, నిరక్షరాస్యులకు చదవడం, రాయడం మాత్రమే కాకుండా డిజిటల్ అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారడం ద్వారానే సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుందని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక క్రమశిక్షణ ప్రతి కుటుంబానికి అత్యంత అవసరమని తెలిపారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం, ఆన్లైన్ బిల్లుల చెల్లింపు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్లు, ఏటీఎం వినియోగం వంటి అంశాలలో అవగాహన పెంపొందించడం ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడతారని పేర్కొన్నారు. ప్రతి మహిళ చదువుకుంటే ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్నారు.

మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు చట్టపరమైన అవగాహన, పౌర హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలు తెరవడం, పొదుపు అలవాట్లు పెంపొందించడం, ఏటీఎం వినియోగం, ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మెప్మా డీడీ అనిల్ కుమార్, డీఎంసీ శివాజీ, టీఎంసీ శ్రీనివాస్, సి.ఓలు, అనిల్‌కుమార్, జ్యోతి, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ఎబీ పాల్గొన్నారు.

# తెలంగాణలో స్థిరంగా ఇంధన, ఎల్పీజీ సరఫరా: ఓఎంసీలు

న్యూఢిల్లీ, మే 18:రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలో ఓఎంసీల రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయి.

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయటం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశామనీ, ఈ సీజన్‌కు ఇది సాధారణమని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం డీఏసీ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. రాష్ట్రంలో డీఏసీ అమలు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి.

నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని.. విశ్వసనీయ సంస్థలు అందించే వార్తలను మాత్రమే విశ్వసించాలని సామాన్య ప్రజలకు ఓఎంసీలు మరోసారి విజ్ఞప్తి చేశాయి.

# ఏపీలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు : హోం మంత్రి అనిత

అమరావతి, మే 18:ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం తిరుమలను దర్శించుకున్నారు. ఉదయం ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుపతిలోని స్పెషల్ సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది అన్ని చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. జైలు నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపట్టి , ఖైదీల భద్రత , ఖైదీల్లో పరివర్తన తీసుకొస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా జైలు, పోలీసు, అగ్నిమాపక శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని వెల్లడించారు.

# ఇనుప పెట్టెలో మహిళ మృతదేహం.. రైలు స్లీపర్ కోచ్‌లో లభ్యం

లక్నో, మే 18: రైలు స్లీపర్ కోచ్‌లో అనుమానాస్పద ఇనుప పెట్టెను పారిశుధ్య సిబ్బంది గుర్తించారు. తాళం పగులగొట్టి దానిని తెరిచి చూడగా మహిళ మృతదేహం భాగాలున్నాయి. ఆమెను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పెట్టె, బ్యాగులో ఉంచి రైలులో వదిలేసినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని ఛప్రా నుంచి బయలుదేరిన ఎక్స్ ప్రెస్ రైలు, లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించింది. కాగా, సోమవారం ఉదయం ఆ రైలు కోచ్‌లను పారిశుధ్య సిబ్బంది క్లీనింగ్ చేస్తుండగా ఒక స్లీపర్ కోచ్ సిటు కింద వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను వారు గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో



ఆ ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మృతదేహం భాగాలు ఉన్నాయి. మొండెం, వేరు చేసిన తల భాగాలు పెట్టెలో, కాళ్లు, చేతుల భాగాలను పాలిథిన్ సంచుల్లో ప్యాక్ చేసి బట్టల మధ్య దాచి బ్యాగ్‌లో ఉంచడాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు.

మరోవైపు మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని రైల్వే పోలీస్ అధికారి తెలిపారు. ఆమె గొంతు కోసి హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా నరికిన హంతకులు ఇనుప పెట్టె, బ్యాగులో వాటిని ఉంచి రైలులో వదిలేసినట్లు అనుమానించారు. ఆ రైలు ప్రయాణించిన అన్ని రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మహిళలకు నెలకు రూ.3,000.. బెంగాల్ ప్రభుత్వ నిర్ణయం.. జూన్ 1 నుంచి సంక్షేమ పథకాల అమలు



పశ్చిమ బెంగాల్ మే 18:ఇటీవలే పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో హామీ మేరకు కొన్ని పథకాల అమలుపై నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సోమవారం సీఎం సువేందు అధికారి ఆధ్వర్యంలో రెండోసారి క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో.. జూన్ 1 నుంచి పలు పథకాల అమలు చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు.

దీని ప్రకారం.. వచ్చే జూన్ 1 నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలు చేస్తారు. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, సీఏఏ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు.

ఇప్పటికే అమలవుతున్న లక్షీ భండార్ పథకం లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేయకుండానే అన్నపూర్ణ పథకానికి అర్హత పొందుతారని మంత్రి చెప్పారు. ఇంకా ఈ పథకం పొందలేని వారు దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే కొత్త పోర్టల్ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరోవైపు మతపరమైన సంక్షేమ పథకాల్ని, ప్రోత్సహకాల్ని జూన్ 1 నుంచి రద్దు చేయబోతున్నట్లు తెలిపారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయే అవకాశం ఉంది.

అలాగే, ఓబీసీలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్ని కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవలే సువేందు అధికారి ప్రభుత్వం ప్రకటించింది.

# ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతినీ, సుస్థిరతను ప్రోత్సహించడంపై దృష్టి: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మే 18:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 2026 మే 18, 19 తేదీల్లో వియత్నాంలోనూ, 2026 మే 19 నుంచి 21 వరకు రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోనూ పర్యటిస్తారు. ఈ పర్యటనకు బయలుదేరే ముందు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన పోస్టులో ఈ రెండు దేశాల్లోనూ చేపట్టే పర్యటన ద్వైపాక్షిక సంబంధాల పరిధిని మరింత విస్తరిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వ్యూహాత్మక సైనిక సహకారాన్నీ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యాలనూ బలోపేతం చేసుకోవడం, నౌకా వాణిజ్య సహకారాన్ని ప్రోత్సహించడం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతినీ, స్థిరత్వాన్నీ పెంపొందించడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

వియత్నాంలో రక్షణ మంత్రి పర్యటన రెండు దేశాల మధ్య ఏర్పడిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి పదేళ్లు పూంయిన సందర్భాన్ని సూచిస్తుంది. ఈ భాగస్వామ్యాన్ని 2026 మే 5 నుంచి 7 వరకు భారత్‌లో వియత్నాం అధ్యక్షుడు పర్యటించిన సందర్భంలో విస్తరించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మెరుగుపరిచారు. ఈ పర్యటనలో భాగంగా వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్‌తో శ్రీ రాజనాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు చేపడతారు.

2022 జూన్ 8 నుంచి 10 వరకు రక్షణ మంత్రి వియత్నాంలో పర్యటించిన సమయంలో 2030 నాటికి భారత్-వియత్నాం రక్షణ భాగస్వామ్య సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. ద్వైపాక్షిక రక్షణ సహకారానికి నిర్దిష్టమైన మార్గాన్ని ఈ దార్శనిక పత్రం అందిస్తుంది. ఈ ప్రాంతంలో శాంతి, సంక్షేమం విషయంలో రెండు దేశాలకు ఉమ్మడి ఆసక్తి ఉంది.

వియత్నాంలో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పర్యటించే సమయంలోనే.. 2026 మే 19న ఆ దేశ మాజీ అధ్యక్షుడు హో చి మిన్ 136వ జయంతిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హో చి మిన్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి రక్షణ మంత్రి నివాళి అర్పిస్తారు.

దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఆ దేశ రక్షణ మంత్రి ఆన్ గ్యూ-బెక్‌తో శ్రీ రాజనాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని మంత్రులు సమీక్షిస్తారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు కొత్త కార్యక్రమాలను అన్వేషిస్తారు. ఉమ్మడి ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై తమ ఆలోచనలను పంచుకుంటారు.

రక్షణ కొనుగోళ్ల కార్యక్రమ నిర్వహణ సంస్థ (డీఏపీఏ) మంత్రి లీ యాంగ్ చియోల్‌తో కూడా సమావేశమవుతారు. ఇండియా-కొరియా బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు.

కొరియా యుద్ధ సమయంలో భారత్ అందించిన తోడ్పాటు చరిత్రలోని గొప్ప అధ్యాయాల్లో ఒకటి. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వం పట్ల భారత్‌కున్న అంచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శనం. యుద్ధంలో గాయపడినవారికి చికిత్సను అందించాలని నిర్ణయించి సైన్యానికి చెందిన 60 పారాచ్యూట్ ఫీల్డ్ అంబులెన్స్ విభాగాన్ని భారత్ మోహరించింది. ఈ యూనిట్ మూడేళ్లకు పైగా అనేక మంది పౌరులకు సేవలందించింది. రెండు లక్షల కంటే ఎక్కువ మంది రోగులకు చికిత్సను అందించింది. సుమారు 2,500 శస్త్రచికిత్సలను నిర్వహించింది. భారత్ అందించిన మరో సహకారం.. తటస్థ దేశాల పునరావాస కమిషన్‌కు అధ్యక్షత వహించడం. ఐక్యరాజ్యసమితిలో భారత్ చేసిన ఈ ప్రతిపాదన మెజారిటీతో ఆమోదం పొందింది. దీని ప్రకారం 5,230 మంది సైనికులతో కూడిన భారత్ కస్టోడియన్ దళం.. యుద్ధానంతర దశలో దాదాపు 2,000 మంది ఖైదీలను శాంతియుతంగా వారి స్వదేశాలకు పంపించింది.

అమర వీరుల గౌరవార్థం.. 2026 మే 21న దేశభక్తులు, మాజీ సైనికుల వ్యవహారాల మంత్రి క్వన్ ఓ-యూల్‌తో కలసి భారత యుద్ధ వీరుల స్మారక చిహ్నాన్ని ప్రారంభిస్తారు.

భారత దేశం అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్ విధానం' , రిపబ్లిక్ ఆఫ్ కొరియా అనుసరిస్తున్న 'ఇండో-పసిఫిక్ వ్యూహం' మధ్య ఉన్న సహజమైన సంబంధం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి విలువలు.. రెండు దేశాల మధ్య సంబంధాల్లో నూతన అధ్యాయానికి నాంది పలికాయి.

# ఎండల నుంచి రక్షణకు జాగ్రత్త చర్యలు, సంప్రదాయ వైద్య పద్ధతులు, అత్యవసర చికిత్సపై మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, మే 18:దేశంలోని పలు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాలుల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ఆధ్వర్యంలోని ఆయుష్ విభాగం.. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రస్తుత వేసవి కాలానికి గానూ సమగ్రమైన ప్రజారోగ్య సలహాలను జారీ చేసింది.

ఇందులో వడదెబ్బ, ఎండ తీవ్రత నుంచి తగిన రక్షణ పొందేందుకు వీలుగా సాధారణ ప్రజలు, వృద్ధులు, గర్భిణులు, ఉద్యోగులు, కార్మికులు...అలాగే బహిరంగ సభలు, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే వారి కోసం వివరణాత్మక మార్గదర్శకాలను అందించింది. శరీరానికి సరిపడా నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయాల్లో నేరుగా ఎండ తగలకుండా చూసుకోవడం, లేత రంగు కాటన్ దుస్తులను ధరించడం, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉండే ద్రవ పదార్థాలను తీసుకోవడం వంటి అంశాల గురించి వివరించింది.

వడగాలుల సమయంలో శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు, ఎండలో పనిచేసే కార్మికులు, గుండె జబ్బులు, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు చాలా త్వరగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని.. వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిరంతరం పర్యవేక్షణ అవసరమని మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.

పని ప్రదేశాలు, బహిరంగ సభల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలను సూచించింది. వీటిలో విశ్రాంతి తీసుకోవడానికి నీడ కలిగిన ప్రాంతాలను ఏర్పాటు చేయడం, క్రమం తప్పకుండా నీరు తాగేందుకు విరామం తీసుకోవడం, వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేలా కార్మికులకు తగిన వసతులు కల్పించడం, వడదెబ్బ లక్షణాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

తీవ్రమైన ఎండల కారణంగా వచ్చే అనారోగ్యాల పట్ల, వాటి ప్రమాద సంకేతాల పట్ల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సూచనల్లో తెలిపింది.

కళ్ళు తిరగడం, తలనొప్పి, వాంతులు, కంగారు లేదా స్పృహ తప్పడం, శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడం, డీహైడ్రేషన్, ఫిట్స్ రావడం వంటి వాటిని తీవ్ర లక్షణాలుగా గుర్తించాలని పేర్కొంది. ముఖ్యంగా వడదెబ్బను తక్షణ వైద్య సహాయం అవసరమయ్యే వైద్య అత్యవసర పరిస్థితిగా గుర్తించింది.

పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే 108 లేదా 102 అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపింది.

డీజీహెచ్ఎస్ పరిధిలోని ఆయుష్ విభాగం విడుదల చేసిన అదనపు సూచనల్లో తీవ్రమైన ఎండల నుంచి రక్షణ కోసం ఆయుర్వేదం, సిద్ధా, యోగా, యునానీ, హోమియోపతి వంటి ఆయుష్ విధానంలో అందుబాటులో ఉన్న సంప్రదాయ ఆరోగ్య, నివారణ చర్యలను కూడా మంత్రిత్వ శాఖ పొందుపరిచింది.

శరీరానికి చలవనిచ్చే ఆహార నియమాలను పాటించాలని ఆయుర్వేద విభాగం సూచించింది. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి పానీయాలు తీసుకోవడంతో పాటు.. తీవ్రమైన ఎండల్లో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి సాంప్రదాయకంగా తయారుచేసే నిమ్మరసం, మామిడి, చింతపండుతో చేసిన పానీయాలను తీసుకోవాలని సూచించింది.

శరీరానికి చల్లదనాన్నిచ్చే సహజ ఆహార పదార్థాలతో పాటు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచడానికి, ఎండ వల్ల కలిగే ఒత్తిడిని తగ్గించడానికి శీతలీ ప్రాణాయామం వంటి శ్వాస పద్ధతులు, తేలికపాటి యోగాసనాలను పాటించాలని సిద్ధ, యోగా విభాగాలు సూచించాయి.

యునానీ వైద్య విధానంలో వడదెబ్బ, డీహైడ్రేషన్ నివారణకు సంప్రదాయ శీతల పానీయాలు, ఔషధ లేపనాలను సూచించగా.. హోమియోపతి విభాగం తీవ్ర ఎండ సమయాల్లో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించింది.

వేసవిలో దోస, పుచ్చ, నిమ్మ, ఖర్బూజా, బూడిద గుమ్మడి, టమాటా వంటి శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారాలను రోజువారీ ఆహారంలో చేర్చాలని ప్రజలకు సూచించింది.

భారత వాతావరణ శాఖ జారీ చేసే వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వడగాలుల హెచ్చరికల సమయాల్లో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించింది.

# 'ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి'

## -బూర్గంపహాడ్ మాక్ డ్రిల్ నిర్వహణలో కలెక్టర్ అంకిత్



ఖమ్మం, మే 18: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు అప్రమత్తత, శాఖల మధ్య సమన్వయంతో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్‌కు ఆయన హాజరయ్యారు. తొలుత పునరావాస కేంద్రం, ఆపరేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. ఫైర్ సేఫ్టీ అధికారి క్రాంతికుమార్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ 6వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన శంకర్, సీఆర్పీఎఫ్ కమాండర్ రాజేష్ దోగ్రా అబ్జర్వర్లుగా వ్యవహరించారు.తెలంగాణ సమాచారం

వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు తాగునీరు, భోజనం, వైద్య సేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను డెమో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా బూర్గంపహాడ్ ఎస్సీ కాలనీ నుండి 10 మంది గర్భిణులు, 45 మంది చిన్నారులు, 26 పశువులను సురక్షితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడే బాధితులకు తక్షణ వైద్య సేవలు, ఆశ్రయం, తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశు సంవర్ధక శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించడమే కాకుండా గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు.

ఈ అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ విపత్తుల సమయంలో గోల్డెన్ అవర్‌లో తీసుకునే చర్యలు ప్రాణ రక్షణకు కీలకమని, శాఖల మధ్య సమన్వయంతో తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్‌లో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ఇలాంటి మాక్ డ్రిల్ ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఎంహెచ్ఓ తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఏడీఏ తాతారావు, బూర్గంపహాడ్ తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు ముక్కంటేశ్వరరావు, నగేశ్‌తో పాటు మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసలైన కాంగ్రెస్ వాళ్లు మనతో రావడానికి రెడీ : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



నల్గొండ, మే 18: నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రైతు మహాధర్నాలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్‌కు ముందు రైతులు ధర్నా చేయని రోజు లేదు. కానీ మళ్లీ ఇవ్వాళ 12 ఎండ్ల తర్వాత అదే పరిస్థితి. కాంగ్రెస్ చేసిన పాపం? రేవంత్ సర్కార్ చేసిన శాపంతో రైతులు మళ్ళీ ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఉద్యమ సమయంలోనే కేసీఆర్ జిల్లాలో ఊరూరు తిరిగి కష్టాలు చూశారు.

అందుకే అప్పుడే కేసీఆర్ నల్లగొండపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని భావించారు. అందుకే ప్రత్యేక విజన్‌తో కేసీఆర్ జిల్లాను అభివృద్ధి చేశారు. 2013లో 3 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి కేసీఆర్ హయాంలో 2023లో 40 లక్షలకు జిల్లా ధాన్యం ఉత్పత్తి పెరిగింది. మధ్యలో మోదీ కొనుగోలు చేయనని అంటే.. ఏకంగా ఢిల్లీలో ప్రభుత్వాన్ని తీసుకెళ్లి ధర్నా చేసిన ఘనత కేసీఆర్ దన్నారు.

రైతులను చైతన్యం చేసి పంటలను పడించే ప్రయత్నం చేశారు.పంటల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టి చివరి గింజ వరకు కొనిపించారు.తడిసిన ధాన్యం సైతం భేషరతుగా కొనిపించారు.దేశమంతా కరోనాతో ఇబ్బంది పడుతుంటే..కల్లాల వద్దకు వెళ్లి కేసీఆర్ కొనిపించారు.కానీ చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డిని నమ్మి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.చెప్పు తీసుకొని కాంగ్రెస్ పార్టీని, రేవంత్ సర్కార్‌ను కొట్టాలని మాజీ మంత్రిజగదీష్ రెడ్డి మండిపడ్డారు.సివిల్ సప్లై శాఖ మంత్రికి సోయి లేదు. కనీసం రివ్యూ చేసే తీరిక లేదు.తరుగు పేరుతో రైతులను దోచుకుంటుంటే పట్టడం లేదు.క్వింటాల్‌కు పది కిలోలు కట్ చేస్తున్నారు.కానీ మంత్రులు అడ్రెస్స్ లేరు.కటింగ్ పెట్టడం కూడా మంత్రులకు తెలిసే జరుగుతుంది. మిలర్ల వద్ద కమిషన్లు దొబ్బడానికే మంత్రులుమౌనంగా ఉంటున్నారు.జిల్లాకు చెందిన ఇద్దరూ మంత్రులు ఎలా దోచుకోవాలి? దాచుకోవాలి అన్నధ్యాసనే.మోదీ, చంద్రబాబులకు పుట్టిన హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రస్తుతం ఉన్నది.అసలు కాంగ్రెస్ వాళ్ళు మనతో రావడానికి సిద్ధంగా ఉన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, దోపిడీ ఆపాలని డిమాండ్ చేశారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ట్రాక్టర్ దహనం.. నిలదీసిన గ్రామస్థులు

ఆదిలాబాద్, మే 18:మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామంలో విద్యుత్ ప్రమాదం తో ఆదివారం ట్రాక్టర్ దహనంఅయ్యింది. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన విద్యుత్ అధికారులను గ్రామస్థులు నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామంలో వేలాడే కరెంట్ తీగలు, వంగిన స్తంభాల కారణంగానే ప్రమాదం సంభవించిందని, పేద రైతు ట్రాక్టర్ దహనమైందని ఆరోపించారు. విద్యుత్ శాఖ ఏఈ జాన్, లైన్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ లైన్‌మెన్ మహదేవ్‌ను మూడు గంటల పాటు అడ్డగించి పరిహారం కోసం డిమాండ్ చేశారు. గ్రామంలో దాదాపుగా 15 దారుల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ వాహనాలకు, ఎడ్ల బండ్లకు కూడా తాకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

మరమ్మతులు చేపట్టాలని కొన్ని నెలలుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్సై కే ప్రసాద్ అక్కడకు చేరుకుని అటు స్థానికులతో, ఇటు అధికారితో మాట్లాడారు. రెండు, మూడు నెలల్లో ట్రాక్టర్ యజమానికి పరిహారం ఇప్పించడానికి ప్రతిపాదనలు పంపిస్తామని డీఈఈ ఫోన్లో చెప్పడంతో స్థానికులు శాంతించారు.

ఈ వర్షాకాలం ప్రారంభానికి ముందే గ్రామంలో విద్యుత్ లైన్ల పూర్తి స్థాయి మరమత్తులు పూర్తి చేసి ప్రమాధాలు జరగకుండా చూడాలని కోరారు. అచ్చలాపూర్ ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, కొండ సాయి, మాజీ ఉప సర్పంచ్ అడువాల సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఒక వ్యక్తితో తల్లికి సంబంధంపై కుమారుడు ఆగ్రహం.. హత్య చేసి మృతదేహం దహనం



బెంగళూరు, మే 18: ఒక వ్యక్తితో తల్లికి ఉన్న సంబంధంపై కుమారుడు ఆగ్రహించాడు. ఈ నేపథ్యంలో ఆమెను కొట్టి చంపాడు. మృతదేహాన్ని ఒకచోటకు తరలించి దహనం చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు ఆ వ్యక్తితో పాటు సహకరించిన మరో ఇద్దరిని కూడా అరెస్ట్ చేశారు. కర్ణాటకలోని మైసూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మదహళ్లి గ్రామానికి చెందిన 30 ఏళ్ల శివరుద్రప్ప తన తల్లి 48 ఏళ్ల సుధాపై అనుమానం వ్యక్తం చేశాడు. ఒక వ్యక్తితో ఆమెకు ఉన్న సంబంధాన్ని అతడు వ్యతిరేకించాడు.

కాగా, ఇటీవల ఆ వ్యక్తితో కలిసి బైక్‌పై తల్లి సుధ వెళ్లడాన్ని శివరుద్రప్ప చూశాడు. ఈ నేపథ్యంలో ఆగ్రహంతో రగిలిపోయాడు. ఆదివారం ఉదయం తల్లిని దారుణంగా కొట్టాడు. గాయపడిన ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేందుకు బంధువులు ప్రయత్నించారు.

మరోవైపు తల్లిని తానే ఆసుపత్రికి తీసుకెళ్తానని బంధువులకు శివరుద్రప్ప చెప్పాడు. అయితే ఆమెపై మళ్లీ దాడి చేశాడు. రాయితో తలపై మోది తల్లిని హత్య చేశాడు. కనియనహుండి సమీపంలోని ఒక తోటలోకి ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లాడు. అక్కడ నిప్పంటించి దహనం చేసి పారిపోయాడు.

ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. తల్లిని హత్య చేసిన శివరుద్రప్పతో పాటు అతడికి సహకరించిన కజిన్స్ అయిన 24 ఏళ్ల ఆకాష్, 22 ఏళ్ల అభిని అరెస్ట్ చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# సంగీత, సాహిత్య, సంఘ సంస్కరణల సమన్వయ రూపం... బెంగుళూరు నాగరత్నమ్మ

బెంగుళూరు నాగరత్నమ్మ (1878 నవంబర్ 3 ? 1952 మే 19) భారతీయ సంగీత చరిత్రలో మాత్రమే కాదు, సాంస్కృతిక, సాహిత్య, సమాజోద్ధరణ రంగాల్లోనూ ఒక గొప్ప పథదిశ చూపిన మహిళ. పురుషాధిక్యత గల సమాజంలో, ఓ దేవదాసీగా పుట్టిన ఆమె, సంగీతంలో పరిపక్వత, సాహిత్యంలో స్పష్టత, సమాజ సేవలో స్పృహతో అద్భుత మార్గాన్ని రూపొందించుకుంది. ఆమె జీవిత గాధ ఒక చైతన్య గాధగా, స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచింది.



నాగరత్నమ్మ 1878లో మైసూరు సమీపంలోని నంజన గూడులో జన్మించారు. ఆమె తల్లి పుట్టలక్ష్మి, మైసూరు రాజాస్థానంలో గాయనిగా గుర్తింపు పొందిన దేవదాసీ. చిన్న వయసులోనే నాగరత్నమ్మ సంగీతం, నాట్యం, భాషలపై మక్కువ చూపారు. సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడ, ఆంగ్ల భాషల్లో ఆమెకు ప్రావీణ్యం ఉండటం వలన ఆమె వ్యక్తిత్వంలో ఒక సార్వభౌమత్వ భావన కుదిరింది. సంగీతంలో మునుస్వామప్ప వద్ద శిక్షణ పొందిన ఆమె, త్యాగరాజు సంప్రదాయాన్ని హృదయ పూర్వకంగా అనుసరించారు. చిన్న వయసులోనే వేదికలపై ఆమె గానం ప్రజల్లో భావోద్వేగాన్ని రేకెత్తించింది. ఆమె హరికథ లోనూ అనుపమమైన ప్రతిభ కనబరిచారు. రాజమహేంద్ర వరములో

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి తొడగిన గండ పెండేరము, 1949లో గృహలక్ష్మి స్వర్ణ కంకణము గ్రహించడము ఆమె ప్రతిభకు తార్కాణములు.

నాగరత్నమ్మ సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి తిరువైయూరులో త్యాగరాజ మహర్షి సమాధిని పునర్నిర్మించడం. సమాధి శిథిలావస్థలో ఉండడాన్ని చూసి ఆమె చలించారు. 1921లో తన స్వంత ధనంతో అక్కడ ఆలయం నిర్మించి, త్యాగరాజు పట్ల తన భక్తిని క్రియాత్మకంగా చాటారు. అప్పటిదాకా మహిళలకు త్యాగరాజ ఆరాధనలో ప్రవేశం లేని పరిస్థితిని ఆమె ధైర్యంగా ఎదుర్కొని మహిళా కళాకారులకు సమాన అవకాశాల దారి తీశారు. ఆమె ఈ చర్య ద్వారా సంగీతంలో మహిళల అస్తిత్వానికి మార్గం వేసింది.

సాహిత్య రంగం లోనూ ఆమె విప్లవాత్మకంగా వ్యవహరించారు. ముద్దుపళని రచించిన "రాధికా సాంత్వనం" అనే శృంగార కావ్యాన్ని 1910లో తిరిగి ప్రచురించడం ఆమె సాహసానికి నిదర్శనం. అప్పటి వరకు శృంగారాన్ని మహిళల అభివ్యక్తిగా గుర్తించకుండా, అసభ్యతగా కొట్టిపారేసిన సమాజానికి ఆమె నిలదీసిన శబ్దమిదే. ఆమె ఈ ప్రచురణపై విమర్శలు వచ్చినప్పటికీ, ఆమె దృఢంగా "ఇది సాహిత్య అభివ్యక్తి స్వేచ్ఛపై పునాదిగా నిలుస్తుంది" అన్నారు. ఆమె దృక్పథం పురుషాధిక్యతను ప్రశ్నించింది, మహిళల ఆలోచనా స్వాతంత్ర్యానికి బలమిచ్చింది.

సమాజ సేవలో ఆమె చేపట్టిన కార్యాలు దేవదాసీ వ్యవస్థలో బాధిత మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటంగా నిలిచాయి. మద్రాసు ప్రెసిడెన్సీలో దేవదాసీల సంఘానికి తొలి అధ్యక్షురాలిగా ఆమె ఎన్నుకోబడ్డారు. ఈ పాత్ర ద్వారా ఆమె బాధిత దేవదాసీ స్త్రీల జీవితాల్లో వెలుగు నింపేందుకు పాటుపడ్డారు. తాను సంపాదించిన సంపదను ఆర్థికంగా వెనుకబడిన వారికోసం వినియోగించడంలో ఆమె ఎటువంటి వెనుకంజ వేసింది లేదు.

1952 మే 19న నాగరత్నమ్మ త్యాగరాజుని తలుచుకుంటూ తుదిశ్వాస విడిచారు. ఆమె కోరిక మేరకు ఆమె సమాధి త్యాగరాజ ఆలయానికి ఎదురుగా నిర్మించారు. ఆమె సమాధి స్థలం నేడు సంగీత ప్రియులకు త్యాగరాజు సమాధితోపాటు మరొక పుణ్య స్థలంగా మారింది. బెంగుళూరు నాగరత్నమ్మ జీవితం ఒక చరిత్ర సంగీతానికి, సాహిత్యానికి, స్త్రీ హక్కులకు మధ్య అద్భుతమైన సంధి. ఆమె గాత్రం అనురాగానికి ప్రతిరూపమైతే, ఆమె కలం స్వేచ్ఛకు అర్థం. ఆమె నడక నిరంకుశ సమాజంపై ప్రశ్న. ఆమె జీవితం, సమాజంలోని ప్రతి మహిళకు తన అభిమతాన్ని నిర్భయంగా ప్రకటించే స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆమె పేరు కేవలం సంగీతంలో కాదు .. అభివ్యక్తి స్వేచ్ఛ, స్త్రీ సాధికారత చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోయింది.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

# "ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి" పుస్తకావిష్కరణ




తిరుపతి, మే 18: స్వీయ అనుభవాలను శాస్త్రీయతతో నిరూపణ చేసి ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి అనే పుస్తకాన్ని దొరై రాజ్ అందించారని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ ఆచార్య జంపాల వెంకటరమణ పేర్కొన్నారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి అనుసరించాల్సిన 50 మార్గాలను రచయిత ఈ పుస్తకంలో సూచించారని చెప్పారు. అధ్యక్షత వహించిన కథా రచయిత ఆర్. సి. కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అంశాలను దొరై రాజ్ తనదైన శైలిలో వివరించి అందుబాటులోకి తీసుకురావడం వెనుక ఎంతో అనుభవం,కష్టం దాగి ఉందని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉద్యోగ సోపానం ఎడిటర్ ఎస్. వి. సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో అక్షరం తన రూపాన్ని మార్చుకుందని అయినా అక్షరం విలువ తగ్గలేదని అన్నారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి అందరికీ అర్థమయ్యేలా సులభ శైలిలో ఉన్న ఇలాంటి పుస్తకాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదవాలని సూచించారు. రచయిత దొరై రాజ్ స్పందిస్తూ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తనలోని జ్వలించే తపన ఆధారంగా ప్రతి ఒకరు ఉన్నత స్థితికి చేరుకోవడానికి అనువుగా ఈ పుస్తకాన్ని రాసినట్లు చెప్పారు. ప్రాచ్య పరిశోధన సంస్థకు చెందిన డాక్టర్ టి. రాజశేఖర్ పుస్తక సమీక్ష చేయగా మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. సుభాషిణి,భాషా శాస్త్రవేత్త ఎస్. భాస్కర్ రాజు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కే. సుబ్రహ్మణ్యం, దాసరి చంద్రయ్య,ఏ. మల్లేశ్వరరావు, డాక్టర్.బి. చక్రపాణి, సీఎన్ శరవణ, ప్రియాంక,ప్రేమ్ చంద్ విశ్వనాథ రాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ.2.30 లక్షలు కాజేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్ట్

హైదరాబాద్, మే 18: హైదరాబాద్ లో మరో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తానంటూ సోషల్ మీడియా ద్వారా ఓ నిరుద్యోగ మహిళను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కూకట్‌పల్లిలో నివాసముండే టి.కిశోర్ (30).. ఓ సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈజీ మనికి అలవాటు పడ్డ కిశోర్ పేస్ బుక్ ద్వారా అంబర్‌పేటకు చెందిన ఓ నిరుద్యోగ మహిళకు పరిచయమయ్యాడు.

ప్రముఖ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అనంతరం వాట్సాప్ ద్వారా నకిలీ జాయినింగ్ ఆర్డర్లు పంపి వివిధ ఫేక్ బ్యాంకు ఖాతాల్లో రూ. 2లక్షల 30 వేలు జమచేయించుకుని మోసానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు కిశోర్ అరెస్ట్ చేసి అతని వద్ద రూ. 2లక్షల నగదు, మరో రూ. 25వేల అతని బ్యాంకు ఖాతాలో ఫ్రీజ్ చేశారు. సోమవారం కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్ కు తరలించారు.

ఈ నేపథ్యంలో అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్‌ల ద్వారా వచ్చే ఉద్యోగ అవకాశాలను నమ్మొద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తులకు డబ్బులు పంపొద్దని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు

# కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూమ్ మధుకు అభినందనల వెల్లువ



రాజన్న సిరిసిల్ల, మే 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడిగా తూమ్ మధు నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలియజేశారు. అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు , వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు కలిసి తూమ్ మధును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తూమ్ మధు నాయకత్వంలో వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలపై కేసులు నమోదు

**-డీఎస్పీ నాగేంద్రచారి**



రాజన్న సిరిసిల్ల, మే 18: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా మే 1 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉందని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణ కేంద్రంలో పోలీసుల అనుమతి లేకుండా ధర్నా నిర్వహించి శాంతిభద్రతలకు, ప్రజా రవాణాకు విఘాతం కలిగించిన రెండు వర్గాలపై సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి క్రైం నంబర్లు 270/2026, 271/2026గా నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అలాగే సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య సమాచారాన్ని ప్రచారం చేసి జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లను కూడా బాధ్యులుగా పరిగణిస్తామని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నందున అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని డీఎస్పీ నాగేంద్రచారి విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యం-ఫిట్‌నెస్‌పై అవగాహనకు 2కే రన్

## - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు




రాజన్న సిరిసిల్ల, మే 18: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులు, యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల్లో 2కే రన్ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 2కే రన్‌కు కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రారంభించిన ప్రజాపాలన?ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 12 వరకు జిల్లావ్యాప్తంగా పది శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాలు, చెత్త తొలగింపు చేపట్టామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన సదస్సులు నిర్వహించామని, ఆరు రకాల వైద్య నిపుణులతో ప్రత్యేక పరీక్షలు అందించామని పేర్కొన్నారు. పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు డ్రైవర్లకు వైద్య, కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. చైల్డ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా చిన్నారులను సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసి పోషకాహారం వినియోగించుకోవాలని, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. మే 19వ తేదీ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కెరీర్ అండ్ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం, మే 21 సిరిసిల్ల మినీ స్టేడియంలో కబడ్డీ, వాలీబాల్, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలుమే 22 జిల్లా స్థాయి ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక సభ, వేములవాడలో స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం, సిరిసిల్ల కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలుమే 23 సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్‌లో ఉద్యోగ సాధన జాబ్ మేళాజిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో యువత, కిశోర బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప రెడ్డి, డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు పర్మినెంట్ హోదా ఇవ్వాలి'

ఖమ్మం, మే 18: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పర్మినెంట్ హోదా ఇవ్వాలని, కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలను వర్తింపచేయాలని తెలంగాణ రైతుకూలీ సంఘం నాయకుడు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2024లో ప్రభుత్వం నిర్వహించిన సామాజిక కుటుంబ సర్వే ఆధారంగా గ్రామాల జనాభాను పరిగణనలోకి తీసుకుని పారిశుధ్య సిబ్బందిని అధికారికంగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం పని సమయంలో ప్రమాదాలు జరిగినా వైద్య ఖర్చులను కార్మికులే భరించాల్సి వస్తుందని, మెడికల్ సెలవులు లేకపోవడం వల్ల జీతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# డాక్యుమెంట్ రైటర్స్ నూతన అధ్యక్షుడిగా పంపరి నాగరాజు



రాజన్న సిరిసిల్ల, మే 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ డాక్యుమెంట్ రైటర్స్ సంఘం నూతన అధ్యక్షుడిగా పంపరి నాగరాజును సంఘ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. రైటర్స్ వృత్తికి గౌరవం పెరగడంతో పాటు, కార్యాలయాల్లో ఎదురయ్యే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. సంఘం సభ్యుల ఐక్యతతో డాక్యుమెంట్ రైటర్స్ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షుడు పంపరి నాగరాజు, ఉపాధ్యక్షులు సోమినేని మహేష్, నేరెళ్ల రమేష్,ప్రధాన కార్యదర్శి వలవారి అనిల్ యాదవ్,సంయుక్త కార్యదర్శి కొమ్మనపల్లి రాజశేఖర్, క్యాషియర్ తోట క్రాంతి,క్రీడల కార్యదర్శి గాజుల నరేష్, కార్యవర్గ సభ్యులు జోగం శరత్, అద్దంకి రాకేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి- ఎమ్మెల్యేకు వినతి పత్రం



రాజన్న సిరిసిల్ల, మే 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ఈరోజు ఆశా వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆశా వర్కర్ల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన గుర్తింపు, వేతన భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం అశోక్, ఆశా యూనియన్ నాయకులు ఉమా, జ్యోతి తదితరులతో పాటు సుమారు 30 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com